ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
5
మంగళవారం 25 ఫిబ్రవరి 2025



ఫ్రీ హోల్డ్ భూముల ఫిల్టర్



కూటమి సర్కారు ఇచ్చిన హామీలను నెరవేర్చే క్రమంలో ఫ్రీహోల్డ్ భూములను ఫ్రీచేసి అమ్ముకునే హక్కులు కల్పించేందుకు రెవెన్యూ సదస్సులు నిర్వహించింది. వీటిలో సర్వే, సబ్ డివిజన్, సర్వే నెంబర్ల జోడింపుపై ఫిర్యాదులు వెల్లువెత్తాయి. గతంలో ఫ్రీహోల్డ్ భూముల డేటాను జిల్లా యంత్రాంగం పరిశీలించి అందులో అంతా గందరగోళంగా ఉన్నట్టు గుర్తించారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ గైడ్‌లైన్స్ లేకున్నా ఈనాం, మిగుల భూములతో కలగూర గంపలా ఉండటంతో రెవెన్యూకు కంటిమీద కునుకులేకుండా చేస్తోంది. జగన్ సర్కారులో నాటి వైసీపీ పెద్దల భూ అవకతవకలను గుర్తించి సరిచేసేందుకు జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ నేతృత్వంలో రెవెన్యూ శాఖ సిబ్బంది ఫ్రీ హోల్డ్ భూముల డేటాను ఫిల్టర్ చేసే పనిలో పడింది.

- డేటాలో ఈనాం, మిగులు భూములతో మిక్సింగ్
- వైసీపీ నేతల చేతివాటంతో 4 వేల ఎకరాలు పక్కదారి
- పక్కా జాబితా కోసం రెవెన్యూ కసరత్తు

కడప కలెక్టరేట్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 22.34 లక్షల ఎకరాల విస్తీర్ణంలో భూములు ఉన్నాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీల ఆర్థిక తోడ్పాటుకు బ్రిటీష్ కాలం నుంచే అప్పటి రాష్ట్ర ప్రభుత్వాలు అసైన్డ్, డీకేటీ పట్టా, డి.ఫారం లాంటి పత్రాలతో సాగు భూములు 75 వేల నుంచి లక్ష ఎకరాలకు పైబడి పంపిణీ జరిగింది. జగన్ సర్కారులో కొందరు ఎమ్మెల్యేలు అయితే ఏకంగా బినామీ పేర్లతో పేదల కడుపు కొట్టి తమ ఖాతాల్లో వేసుకున్నారు. ఇప్పుడు అలాంటి భూముల భాగోతం బట్టయలు అవుతోంది. నాడు అడ్డగోలు భూ దందాలకు పాల్పడ్డ వైసీపీ చోటా, మోటా నేతలకు చంద్రబాబు ప్రభుత్వం తీసుకుంటున్న కఠిన నిర్ణయాలు మింగుడు పడడం లేదు. ఫ్రీ హోల్డ్ భూములకు 2 నెలల్లో క్లియరెన్స్ చేసి రిజిస్ట్రేషన్లకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చేందుకు సిద్ధమైన కూటమి సర్కారుకు జగన్ పాలనలో జరిగిన అవకతవకలతో మళ్లీ వాయిదా వేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

విస్తుపోయే నిజాలు..

ఇకపోతే గత సర్కారులో ఫ్రీహోల్డ్ భూముల జాబితాలను పరిశీలిస్తున్న అధికారులకు విస్తుపోయే నిజాలు బయట పడుతున్నాయి. జీవో 596లో ఉన్న మార్గదర్శకాలకు విరుద్ధంగా తహశీల్దార్లు వెబ్‌ల్యాండ్, ఆన్‌లైన్‌ల రికార్డుల పరిశీలన చేసి ఆర్డీవో, జాయింట్ కలెక్టర్ లాగిన్‌కు వివరాలు చేర్చే పనిలో తలమునకలై ఉన్నారు. దీంతో నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ఫ్రీహోల్డ్ భూముల అక్రమాలు 3500 ఎకరాలు బయట పడగా మునుముందు ఈ సంఖ్య 4వేల ఎకరాలకు చేరే అవకాశం ఉందని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు.

ఈనాం భూములపై ఫిర్యాదులు

ఎప్పుడో 100 ఏళ్ల కిందట బ్రిటీష్ పాలనలో కులవృత్తుల వారి జీవనోపాధి కోసం జిల్లాలో 10 వేల నుంచి 15 వేల ఎకరాలు ఈనాం కింద పంపిణీ చేసినట్లు సమాచారం. ఆ భూములతో పాటు 1971-83 మధ్య కూడా ఎక్కువ భూములు ఉన్న వారి నుంచి ప్రభుత్వం కొనుగోలు అప్పట్లో ఎస్సీ, ఎస్టీలకు డీకేటీ పట్టాలు ఇచ్చింది. ఈ భూములన్నీ అప్పట్లో సాదా బైనామా, అగ్రిమెంట్ల మీద అమ్మకాలు, రిజిస్ట్రేషన్లు పెద్దఎత్తున జరిగాయి. ఇలాంటి భూములు ప్రస్తుత అనుభవదారులకు చెందాలా? లేక నిషేధిత భూముల జాబితాల్లో ఉన్నందున ఆ భూములు పాత లబ్ధిదారులకు చెందాలా? అనే విషయంపై ప్రభుత్వం నుంచి స్పష్టత రాలేదు. ఈ భూములకు సంబంధించి లావాదేవీల సమస్యల కారణంగా కొన్నిచోట్ల కోర్టు కేసులు కూడా ఉన్నాయి. దీంతో ఏళ్ల తరబడి తమ కుటుంబ ఆర్థిక అవసరాలకు అమ్మకాలు చేయడానికి వీళ్లేకుండా ఉన్న ఈ భూములకు కూడా క్లీన్‌చిట్ ఇప్పించాలని ఇప్పటికే కలెక్టర్‌కు ఫిర్యాదులు వస్తున్నాయి.

మిగుల భూములదీ ఇదే తంతు

జిల్లాలో భూముల ఆన్‌లైన్ ప్రక్రియ ప్రారంభమైన సమయంలో రికార్డులు సక్రమంగా చూపని రైతుల భూములు మిగులు జాబితా (2కోట్ల ఖాతా)లో పడ్డాయి. జిల్లాలో అప్పట్లో పనిచేసిన తహశీల్దార్లు, రెవెన్యూ యంత్రాంగం చిన్నపాటి లోపాలను భూతద్దంలో చూపడంతో దాదాపు వేలాది ఎకరాలు మిగుల భూముల ఖాతాలో చేర్చారు. రెవెన్యూ రికార్డుల స్వచ్ఛీకరణ అంటూ రాష్ట్ర, జిల్లా ఉన్నతాధికారులు రెవెన్యూ సిబ్బందిని ఎప్పటికప్పుడు అలర్ట్ చేస్తున్నప్పటికీ కొన్ని రికార్డుల గల్లంతు కారణంగా 2 కోట్ల ఖాతాలో పడ్డ మిగులు భూములు దాదాపు 4 నుంచి 5 వేల ఎకరాలకు వరకు ఉండొచ్చని తెలుస్తోంది. అప్పట్లో రెవెన్యూ యంత్రాంగం జవాబుదారీ తనంతో పనిచేయని కారణంగా తమకు తిప్పలు తప్పడం లేదని లబ్ధిదారులు.. క్లియరెన్స్ కోసం కలెక్టర్‌కు ఫైల్ చేరాలంటే ప్రయాసే అంటూ బాధిత రైతులు వాపోతున్నారు. మరి కూటమి ప్రభుత్వమైనా ఈ సమస్యకు త్వరగా ముగింపు లేదో వేచి చూడాల్సి ఉంది.

ఫ్రీహోల్డ్ భూములను రీ వెరిఫికేషన్ చేస్తున్నాం

జిల్లాలో 20 ఏళ్ల దాటిన ప్రభుత్వ, అసైన్డ్, డీకేటీ పట్టాలకు సంబంధించిన ఫ్రీహోల్డ్ భూములను రీ వెరిఫికేషన్ చేస్తున్నాం. అర్హులకు భూ యాజమాన్య హక్కులు కల్పించేలా రెవెన్యూ బృందాలు పనిచేస్తున్నాయి. మిగులు భూములన్నీ పట్టా భూములు అయినందున రెవెన్యూ రికార్డుల ఆధారంగా పరిశీలించి హక్కు కల్పిస్తాం. ఫ్రీహోల్డ్ భూములతో పాటు నిబంధనలకు విరుద్ధంగా కొన్ని భూములు ఫ్రీహోల్డ్ జాబితాలో చేర్చారు. ఇనాం భూములు కూడా మిక్స్ అయ్యాయి. వాటన్నింటినీ పరిశీలిస్తున్నాం.

- విశ్వేశ్వర నాయుడు, డీఆర్వో

ప్రజా సమస్యలను అలక్ష్యం చేయొద్దు

- జాయింట్ కలెక్టర్ అదితిసింగ్



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ అదితి సింగ్

కడప కలెక్టరేట్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను అధికారులు ఎప్పటి కప్పుడు పరిష్కరించాలని నిర్లక్ష్యం చేసే అధికారులపై చర్యలు తప్పవని జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సభాభవన్‌లో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ జరిగింది. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారుల విన్నపాలను వింటూ తదుపరి చర్యలకై అప్పటికప్పుడు సంబంధిత అధికారులకు జేసీ సిఫారసు చేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయికి స్వయంగా వెళ్లి పరిశీలించి పారదర్శకంగా విచారణ చేపట్టాలన్నారు. అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కారం ఉండాలన్నారు.

ఈ సందర్భంగా వల్లూరు మండలం కొట్లూరు హరిజన వాడకుకు చెందిన సీతమ్మ ఫిర్యాదు చేస్తూ 28 ఏళ్లుగా అంగన్వాడీ టీచర్‌గా పనిచేస్తున్నానని, స్కూలు ఆవరణలో పోషణ వాటి పెంపకానికి తోట వేశామన్నారు. ఆ తోటలో నుంచి దారి ఇవ్వలేదని అదే గ్రామానికి చెందిన గంగులయ్య అనే వ్యక్తి పిల్లలను బడికి పంపవద్దని తల్లిదండ్రులను బెదిరిస్తున్నాడని జేసీకి తెలిపారు. కలసపాడు మండలం ముదిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన రామాంజనేయ రెడ్డి ప్రభుత్వ చౌక దుకాణం తమ గ్రామంలో ఏర్పాటు చేయాలని కోరారు. కడప నగరానికి చెందిన ఎస్.ఆయేషా తన కుమార్తె అంగవైకల్యంతో ఉన్నదని పెన్షన్ ఇప్పించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరనాయుడు, డీఆర్డీయే పీడీ ఆనంద్ నాయక్, మెప్మా పీడీ ఎస్డీసీ వెంకటపతి, శ్రీనివాసులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

8 నుంచి తిరుపతి హుబ్లీ ప్యాసింజర్



కడప ఎర్రముక్కపల్లె, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మార్చి 8 తేది నుంచి తిరుపతి, హుబ్లీ (57401) ప్యాసింజర్ రైలు కొనసాగుతుందని కడప రైల్వే చీఫ్ కమర్షియల్ మేనేజర్ జనార్దన్ తెలిపారు. మార్చి 9వ తేదీన హుబ్లీ నుంచి తిరుపతి (57402) తిరుగు ప్రయాణం అవుతుందని చెప్పారు. కుంభమేళాను పురస్కరించుకుని డిసెంబరు 28 నుంచి ఈ నెల 28వ తేదీ వరకు ఈ రైలును రైల్వేశాఖ వినియోగించుకుందన్నారు. మార్చి 1 నుంచి యథావిధిగా కొనసాగాల్సి ఉండగా మరో వారంపాటు దానిని వాయిదా వేశారన్నారు.

విభిన్న ప్రతిభావంతుల విద్యాభివృద్ధికి కృషి



ల్యాప్‌టాప్‌లు పంపిణీ చేస్తున్న జేసీ అదితిసింగ్

కడప కలెక్టరేట్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతుల విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సభాభవన్‌లో విభిన్న ప్రతిభావంతులు, ట్రాన్స్‌జెండర్లు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో డిగ్రీ లేదా ఆపై తరగతులు చదువుకున్న 13 మంది విభిన్న ప్రతిభావంతులకు జాయింట్ కలెక్టర్ ల్యాప్‌టాప్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల విద్యాభివృద్ధికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. ఈ ల్యాప్‌టాప్‌లు వారి విద్యా ప్రయాణంలో సహాయ పడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ సహాయకులు ఆర్వీ కృష్ణకిశోర్, వారి సిబ్బంది, లబ్ధిదారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వృద్ధుడి హత్య

7

పొలంలో కొడవళ్లతో నరికిన దుండగులు

జమ్మలమడుగు పూర్వ ఆర్డీవో హోదా తగ్గింపు

- గండికోట భూముల పరిహారం చెల్లింపులో అక్రమాలు
- విచారణలో 18 ఆరోపణల్లో వాస్తవాలు నిర్ధారణ

కలికిరి / కడప కలెక్టరేట్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): గతంలో జమ్మలమడుగు ఆర్డీవోగా పనిచేసిన ఎస్కే వినాయకం హోదాను తగ్గిస్తూ సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గండికోట రిజర్వాయరు నిర్వాసితులకు పరిహారం పంపిణీ చేయడంలో ఆయన తీవ్రమైన అక్రమాలకు పాల్పడ్డట్లు ప్రభుత్వం పేర్కొంది. ఈ వ్యవహారంలో వినాయకం పైన 21 అభియోగాలను నమోదు చేశారు. 2017లో ఈ అక్రమాల వ్యవహారం వెలుగులోకి వచ్చింది. దీనిపైన వినాయకం సమర్పించిన సంజాయిషీతో సంతృప్తి పడని ప్రభుత్వం మరింత లోతైన విచారణ కోసం 2017 నుంచి 2020 వరకూ విచారణ నిర్వహించింది. విచారణ కోసం జాయింట్ కలెక్టరును విచారణాధికారిగా, డీఆర్వోను ప్రెజెంటింగ్ అధికారిగా నియమించారు. అతడిపై నమోదయిన 21 అభియోగాల్లో 15 అంశాలు పూర్తిగా రుజువయ్యాయి. మూడు అంశాలు పాక్షికంగా నిర్ధారణ అయ్యాయి. మరో మూడు అంశాల్లో ఆధారాలు లభించక నిరూపణ కాలేదు. విచారణ నివేదిక అందడంతో వినాయకం నుంచి నేర నిరూపణపై చివరి సంజాయిషీని 2024 జనవరి 5న ప్రభుత్వం కోరింది. తన వివరణను సమర్పించడానికి మూడు నెలలు గడువు ఇవ్వాల్సిందిగా 2024 జూన్ 27 ఆయన కోరారు. అయితే విచారణ నివేదికలోని అంశాలు స్పష్టంగా ఉన్నందున ప్రస్తుత ఆయన హోదాను తగ్గిస్తూ (రిడక్షన్ ఇన్ ర్యాంక్) రెవెన్యూ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఆర్పీ సిసోడియా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

అందరి సహకారంతో అభివృద్ధి

- వైవీయూ నూతన వీసీ ఆచార్య ఫణతి ప్రకాశ్‌బాబు



కొత్త వీసీకి శుభాకాంక్షలు తెలుపుతున్న రిజిస్ట్రార్ పద్మ, ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): అందరి సహకారంతో యోగివేమన యూనివర్సిటీని అభివృద్ధి పథంలో తీసుకెళ్లేందుకు శాయశక్తులా కృషిచేస్తానని నూతన ఉపకులపతి ఆచార్య ఫణతి ప్రకాశ్‌బాబు స్పష్టం చేశారు. విద్యార్థుల ప్రయోజనమే అందరి లక్ష్యం కావాలన్నారు. ఉపాధి అవకాశాలున్న సిలబస్‌ను తీసుకొస్తామని పేర్కొన్నారు. సోమవారం వైవీయూ వీసీ చాంబర్‌లో ఆయన వీసీగా బాధ్యతలు స్వీకరించారు. నూతన వీసీకి రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ, ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.రఘునాథ రెడ్డి, డీన్‌లు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు, స్కాలర్లు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విశ్వవిద్యాలయాన్ని అధ్యయనం చేసి ప్రభుత్వ సహకారంతో నిధులను తెస్తామన్నారు. బోధన, పరిశోధన అత్యంత ప్రాధాన్యత అంశాలుగా తీసుకుంటామని, పరిశోధనలు ఆగిపోతే ప్రగతి ఉండదన్నారు.

విద్యార్థుల అభివృద్ధి మనందరి బాధ్యత

విద్యార్థుల అభివృద్ధి మనందరి బాధ్యతని వీసీ ప్రొఫెసర్ ప్రకాశ్‌బాబు తెలిపారు. బోధన ఉద్యోగానికి ఏఐ పోటీ ఇస్తుందని దానిని అధిగమించేలా నైపుణ్యాలు పెంచుకోవాలని చెప్పారు. సోమవారం విశ్వవిద్యాలయం సైన్స్ బ్లాక్ సెమినార్ హాల్లో ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లతో జరిగిన సమావేశంలో వీసీ మాట్లాడుతూ ప్రతిభావంతులతో పాటు మనం చివరి బెంచ్ విద్యార్థిపైనా ఎక్కువ దృష్టి నిలపాలన్నారు. కృత్రిమ మేధ ఇపుడు బోధన ఉద్యోగానికి పోటీ ఇస్తోందని, దాన్ని అధిగమించి అంతకంటే ఉన్నతంగా బోధన నైపుణ్యాలు పెంచుకోవాలన్నారు. చెడ్డపేరు తెచ్చే ఏ చిన్న సంఘటన జరిగినా తీవ్రంగా పరిగణిస్తామన్నారు. అనంతరం బోధనేతర సిబ్బందితో అన్నమాచార్య సెనెట్ హాల్లో జరగిన సమావేశంలో వీసీ మాట్లాడుతూ పరిపాలన పరుగు పెట్టాలంటే మీ పనితీరు ప్రభావవంతంగా ఉండాలని కోరారు.

ఈవోపీఆర్డీ సస్పెన్షన్

- ఎంఎల్‌సీవో, ఫిట్టర్‌లు సర్వీస్ నుంచి తొలగింపు

కడప రూరల్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఒంటిమిట్ట మండలంలో 15వ ఆర్థిక సంఘం నిధుల దుర్వినియోగానికి పాల్పడిన అప్పటి ఎఫ్ఏసీ ఎంపీడీవో ప్రస్తుత బి.మఠం మండల ఈవోపీఆర్డీని కలెక్టర్ చెరుకూరు శ్రీధర్ సస్పెండ్ చేశారు. ఆర్థిక నేరారోపణలపై విచారణ ముగిసేవరకు సస్పెన్షలో ఉండనున్నారు. అలాగే మండల లెవల్ కో-ఆర్డినేటర్(ఎంఎల్‌సీవో) ఆలీబేగ్, ఫిట్టర్ జనార్ధన్‌ను సర్వీస్ నుంచి రిమూవ్ చేశారు. 2023-24 సమత్సరంలో ఒంటిమిట్ట మండలానికి మంజూరైన ఆర్థిక సంఘం నిధులలో రూ.19,17000ల నిధుల దుర్వినియోగానికి వారు పాల్పడ్డారు.

ఇందుకు సంబంధించి విచారణ నివేదికను ఈ ఆఫీస్ ద్వారా కలెక్టర్‌కు పంపడంతో సోమవారం ఆయన ఆమోదించి పై చర్యలు తీసుకున్నారు.

వైభవంగా... వీరభద్రుడి కళ్యాణం

- వేలాదిగా తరలివచ్చిన భక్తులు



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలోని వీరభద్రాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రెండోరోజు సోమవారం వీరభద్రుడి కల్యాణోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సతీమణి హరిత, కుమారుడు నిశ్చల్‌నాగిరెడ్డిలు స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలను సమర్పించారు. అనంతరం కల్యాణోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కల్యాణోత్సవానికి రాయచోటి పట్టణ ప్రజలే కాకుండా కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ ప్రాంతాల నుంచి కూడా భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. అనంతరం సాయంత్రం 6 గంటల నుంచి మహిళా భక్తులు సుమంగళిపూజ చేసి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి వీరభద్రుడు మయూర వాహనంపై పట్టణ పురవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా, టీడీపీ నేతలు జయరాంరెడ్డి, శివారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, మదన్‌మోహన్, పురప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.



కల్యాణోత్సవానికి హాజరైన జనం



అల్లాడుపల్లె వీరభద్రాలయం



వీరభద్రస్వామి మూలవిరాట్టు

భక్తుల ఆరాధ్యదైవం.. అల్లాడుపల్లె వీరభద్రుడు

చాపాడు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని శైవక్షేత్రాల్లో ప్రసిద్ధిగాంచిన ఆలయాల్లో అల్లాడుపల్లె వీరభద్రస్వామి దేవాలయం ఒకటి. కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాల నుంచి ఇక్కడకు భక్తులు వచ్చి మొక్కులు తీర్చుకుంటారు. ప్రతి ఏడాది ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. ఇందులో భాగంగా 26వ తేదీ బుధవారం నుంచి రెండు రోజులపాటు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు దేవస్థాన ఉత్సవ కమిటీ ఛైర్మన్ పెరుగు వీరనారాయణ, ఈవో శ్రీనివాసులు తెలిపారు. ఈసందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలతో పాటు కల్యాణమహోత్సవం, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. 27న గురువారం ఎద్దులకు రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు నిర్వహిస్తారు. గెలుపొందిన వాటికి మొదటి బహుమతి రూ.1,00,116, రెండో బహుమతి రూ.70,116, మూడో బహుమతి రూ.60,116 ఇవ్వనున్నామని నిర్వాహకులు పేర్కొన్నారు.

నేటి నుంచి పొలతలలో మహాశివరాత్రి ఉత్సవాలు

పెండ్లిమర్రి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రముఖ శైవ క్షేత్రమైన పొలతల దేవస్థానంలో మహాశివరాత్రి ఉత్సవాలు మూడు రోజుల పాటు జరగనున్నాయి. మొదటి రోజు మంగళవారం గణపతి పూజ, హోమాలు, అభిషేకాలు రెండవరోజు బుధవారం ఉదయం ముత్యాల తలంబ్రాలతో శివపార్వతుల కల్యాణం, రాత్రి 10 నుంచి రథోత్సవం నిర్వహిస్తారు. మూడోరోజు ప్రత్యేక కార్యక్రమాలతో పాటు హుండీ లెక్కింపు ఉంటాయి. ఇప్పటికే భక్తులకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.



సహస్ర కలశాభిషేకం

కలికిరి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక పురాతన పార్వతీసమేత సోమేశ్వరస్వామి ఆలయంలో సోమవారం సహస్ర కలశాభిషేకం నిర్వహించారు. మాఘమాసం చివరి ఏకాదశి సోమవారం కావడంతో శివరాత్రి పర్వదినానికి అంకురార్పణ కోసం ఈ కలశాభిషేకం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్వామికి సహస్ర నామార్చన, ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పోలీసుస్టేషన్‌లో ఇంటర్ ప్రశ్నపత్రాలు

పీలేరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ పరీక్షల ప్రశ్నపత్రాలు సోమవారం పీలేరు పోలీసుస్టేషన్‌కు చేరాయి. ప్రభుత్వ నిబంధనల మేరకు వాటిని పోలీసు స్టేషన్‌లో భద్రపరిచారు. ఈ సందర్భంగా ఇంటర్ పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్లు వై.వెంకటరెడ్డి, బి.రెడ్డప్ప, జి.వేణీ కరుణ విలేకరులతో మాట్లాడుతూ పీలేరు మండలంలో ఇంటర్ పరీక్షల కోసం ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, చిత్తూరు మార్గంలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల విద్యాలయాన్ని పరీక్షా కేంద్రాలుగా ఎంపిక చేశారన్నారు. మార్చి 1న ప్రథమ, 3న ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభమవుతాయని తెలిపారు. విద్యార్థులు ఉదయం 8.30 గంటలకల్లా తమకు కేటాయించిన పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని వారు సూచించారు.



పీలేరు పోలీసుస్టేషన్‌లో ఇంటర్ పరీక్షల ఇన్విజిలేటర్లు

ఝరీ స్నానం..

సర్వ పాపహరణం



● మహాశివరాత్రికి సిద్ధమవుతున్న శివాలయాలు

మహాశివరాత్రి సందర్భంగా కలకడ సమీపంలోని సత్యవతి, బాహుదా నదుల సంగమం వద్ద పుణ్యస్నానాలకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. రామసముద్రం మండలంలోని వాలీశ్వరాలయ రథోత్సవానికి కొత్త తేరు సిద్ధమైంది

కలకడ,ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): సత్యవతి నదీ తీరాన వెలసిన కామాక్షి సమేత సిద్దేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మహా శివరాత్రి మరుసటి రోజు నిర్వహించే ఝరి ఉత్సవాలకు వేలాదిగా భక్తులు తరలివస్తారు. కలకడకు తూర్పున దాదాపు 6కిలో మీటర్ల దూరంలో సత్యవతి, బాహుదా నదుల సంగమంతో ఏర్పడే ఈ ఝరిలో మునిగితే సర్వపాపాలు హరించుకుపోయి పుణ్యం దక్కుతుందని భక్తుల విశ్వాసం. మహ శివరాత్రి జాగరణ అనంతరం ఝరికి చేరుకొని పుణ్యస్నానాలాచరిస్తారు. రాయలసీమ జిల్లాల నుంచేకాక హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, విజయవాడ తదితర నగరాల నుంచి వేలాదిగా తరలి వస్తారు. స్నానాలు చేసేటప్పుడు, తోపులాట జరిగినప్పుడు భక్తులు నీటిలో పడిపోకుండా ఆలయ నిర్వాహకులు తాళ్లను ఏర్పాటు చేస్తున్నారు. గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచుతున్నారు. ఝరి ఉత్సవాల్లో పాల్గొనే భక్తుల సౌకర్యార్థం పీలేరు, మదనపల్లె డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా వాహనాల్ని రెండు మార్గాల్లో పంపుతారు.



కలకడ సిద్దేశ్వరాలయం

బ్రహ్మోత్సవాలకు ముమ్మరంగా ఏర్పాట్లు

కామాక్షి సమేత సిద్దేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయాన్ని రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరిస్తున్నారు. భక్తులకు తాగునీటి సౌకర్యం కల్పించారు. తలనీలాలు సమర్పించే భక్తులకు స్నానాలాచరించేందుకు షవర్లను ఏర్పాటు చేస్తున్నారు. చలువ పందిళ్లను నిర్మిస్తున్నారు. మహా శివరాత్రి పర్వదినం రోజు రాత్రి జాగరణ చేసే భక్తుల సౌకర్యార్థం ఆలయం చుట్టూ షామియానాలు ఏర్పాటు చేస్తున్నారు. చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారిలో ఎర్రయ్యగారిపల్లె వద్ద ఉన్న ఆర్చి నుంచి ఆలయం వరకు విద్యుత్ దీపాలు ఏర్పాటు చేస్తున్నారు.

శివాలయాలకు నెలవు పీలేరు

పీలేరు, ఫిబ్రవరి 24: పట్టణంలోని కాశీ విశ్వేశ్వరాలయం, మండలంలోని శివరామపురం భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయం, జంగంపల్లె లోని వీరభద్ర, అడవి పల్లెలోని గుండాల మల్లేశ్వర స్వామి ఆలయాలు మహాశివరాత్రి పర్వదినానికి ముస్తాబవుతున్నాయి.

సూర్యకిరణాలతో అభిషేకం..

పట్టణంలోని కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలోని శివలింగాన్ని ప్రతి మాఘ మాసంలో సూర్యకిరణాలు స్పృశిస్తుంటాయి. మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా పండిత్ ఏర్పాట్లు, శుక్రవారం అంకురార్పణ చేశారు.

శ్రీశైలం తరహాలో..

దొడ్డిపల్లె పంచాయతీలోని శివరామపురంలోని గార్గేయ నదీ ఒడ్డున ఉన్న భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయం శ్రీశైలంలోని శివలింగాన్ని తలపిస్తుంది. శ్రీశైలం వెళ్లలేని వారి కోసం పల్లవులు ఈ ఆలయాన్ని నిర్మించారని తెలుస్తోంది. ప్రతి శివరాత్రికి ఇక్కడ ఉత్సవాలు నిర్వహిస్తారు.

భళా.. వీరభద్రా..

వేపులబైలు పంచాయతీ జంగంపల్లెలోని వీరభద్ర స్వామిని ఆలయంలో కార్తీక మాసంలో ప్రత్యేక పూజలు జరుగుతాయి. సమస్యలతో బాధపడే వారు వీరభద్రుడిని నమ్ముకుంటే తప్పక కాపాడతాడని జంగంపల్లె వాసుల విశ్వాసం. ఈ ఆలయంలో ఆలయానికి అనుబంధంగా జమ్మి చెట్టు ఉండడంతో పీలేరుతోపాటు పరిసర ప్రాంతాల్లోని భక్తులు కార్తీక మాసంలో వీరభద్రుడిని పెద్దసంఖ్యలో దర్శించుకుంటారు. శివయ్య భక్తులతోపాటు అయ్యప్పస్వామి భక్తులు కూడా ఈ ఆలయాన్ని సందర్శిస్తుంటారు.

ప్రకృతి ఒడిలో గుండాల మల్లేశ్వరుడు

పీలేరు మండలం తలపుల పంచాయతీ అడవిపల్లె వద్దనున్న అటవీ ప్రాంతంలో వెలసిన గుండాల మల్లేశ్వరుడు సంతానలేమితో బాధపడే వారికి సంతానాన్ని ఒకసే కల్పతరువుగా విరాజిల్లుతున్నాడు. అటవీ ప్రాంతంలోని ప్రకృతి అందాల మధ్య నెలవైన శ్రీ మల్లేశ్వరుడి ఆలయంలో కార్తీక మాసంలో ప్రత్యేక పూజలు, శివరాత్రి సందర్భంగా జాతర జరుగుతుంటాయి. కార్తీక మాసంలో ఆయనను దర్శించుకుని మొక్కుకుంటే శివరాత్రి వచ్చేలోపు ప్రసాదిస్తాడని భక్తుల నమ్మకం. శివరాత్రి సందర్భంగా రెండు రోజులపాటు అడవిపల్లెలో జాతర జరుగుతుంది. ఆ జాతర కోసం ఇటీవల నూతనంగా నియమితులైన ఉత్సవ కమిటీ సభ్యులు వేగంగా ఏర్పాట్లు చేస్తున్నారు.





శివరామపురంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి.. అడవిపల్లెలోని గుండాల మల్లేశ్వర స్వామి ఆలయం

వాలి ప్రతిష్ఠించిన శివలింగం..

రామసముద్రం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వాలీశ్వరాలయం శివరాత్రి ఉత్సవాలకు సిద్ధమవుతోంది. ఆర్.నడింపల్లె పంచాయతీ బలసంద్రం గ్రామ సమీపంలోని కొండపై ఉన్న ఈ ఆలయాన్ని చోళ రాజుల హయాంలో ఈ ప్రాంతాన్ని పాలిస్తున్న పుంగనూరు దొరలు నిర్మించారని చెబుతారు. కాగా ఈ ఆలయంలోని శివుడు వాలీశ్వరస్వామిగా పేరు పొందడానికి కారణాన్ని ఇలా వివరిస్తారు. త్రేతాయుగంలో వానర రాజైన వాలి తన జోలెలో ఒక శివ లింగాన్ని ఉంచుకుని వనసంచారం చేసేవాడట. ఈ క్రమంలో బలసంద్రం వద్దనున్న కొండ మీదకు చేరుకున్న ఆయన రాత్రి కావడంతో తన జోలెలోని శివలింగాన్ని తీసి ఒకచోట ఉంచి పూజలు చేసిన అనంతరం నిద్రించాడు. ఉదయం శివలింగాన్ని తీసుకెళ్లడానికి ప్రయత్నించగా అది కదలకపోవడంతో, ఆరోజు కూడా కొండపైనే నిద్రించాడు. ఆ రాత్రి శివుడు వాలికి కలలో కనిపించి తాను ఈ కొండలోనే ఉంటానని తనను తీసుకెళ్లే ప్రయత్నించవద్దని చెప్పాడట. అలా వాలి వలన వెలసిన శివుడు కావడంతో వాలీశ్వరస్వామి అని పేరు వచ్చిందని చెబుతారు. ప్రతి ఏటా మహాశివరాత్రికి ఇక్కడ రెండు రోజులు ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.



శివరాత్రికి లక్షల్లో భక్తులు..: వాలీశ్వరస్వామి కొండకు రోడ్డుమార్గం సుగమం కావడంతో ఈ సారి శివరాత్రి వేడుకలకు భక్తులు పోటెత్తే అవకాశం ఉందని ఆలయ నిర్వాహకులు అంటున్నారు. రథోత్సవం కోసం నూతన తేరు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

కల్యాణం.. చూతము రారండి..

● మహాశివరాత్రి ఉత్సవాలకు ముస్తాబైన మల్లయ్యకొండ

● 71 ఆర్టీసీ బస్సులు ఏర్పాటు

తంబళ్లపల్లె, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మల్లయ్యకొండలో కొలువైన భ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామి ఆలయం మహాశివరాత్రి ఉత్సవాలకు ముస్తాబైంది. 25వ తేదీ మంగళవారం ఉదయం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నారు. 26వ తేదీ తెల్లవారు జాము నుంచి స్వామి వారికి అభిషేకాలు, సహస్ర నామార్చన, సాయంత్రం 6 గంటలకు శివపార్వతుల కల్యాణోత్సవం, రాత్రి 9 గంటల నుంచి తెల్లవారుజాము వరకు స్వామి వారి మెరవణి నిర్వహించనున్నారు.

ఏర్పాట్లు పూర్తి : భక్తులు స్వామి వారిని దర్శించుకునేందుకు వీలుగా కొండపైన క్యూలైన్లు ఏర్పాటు చేసి భక్తులు ఎండబారిన పడకుండా చలువ పందిళ్లను ఏర్పాటు చేశారు. కొండపైన నీటి సమస్య తలెత్తకుండా నూతన బోరు వేశారు. రాత్రి సమయాల్లో కొండకు వెళ్లే భక్తులకు ఇబ్బంది లేకుండా ఘాట్ రోడ్డు పొడవునా ఎల్ఈడీ లైట్లు ఏర్పాటు చేశారు. ఉత్సవాలకు 71 ఆర్టీసీ బస్సులు నడుపనున్నట్లు ఆర్టీసీ డీఎం వెంకటరమణారెడ్డి తెలిపారు. మదనపల్లె నుంచి 20 బస్సులు, తంబళ్లపల్లె (రాగిమాను కూడలి) నుంచి 10, బి.కొత్తకోట, ములకలచెరువు, పెద్దమండ్యం నుంచి మల్లయ్యకొండ కిందకు రెండు బస్సులు, అక్కడి నుంచి కొండపైకి 35 బస్సులు చొప్పున నడపనున్నారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఎం కోరారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఈవో మునిరాజ తెలిపారు సులభంగా దర్శనం అయ్యేలా చలువ పందిళ్లతో రెండు క్యూలైన్లను ఏర్పాటు చేశామని, కొండపైన తాగునీరు, నిరంతర విద్యుత్ సరఫరా చేస్తున్నామన్నారు తెలిపారు.

కురబలకోట, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): తాము కొనుగోలు చేసిన భూమిని ఆక్రమించుకోవడానికి ప్రయత్ని స్తున్నారని స్టోర్ ఆలియాస్ గుండు గుండు రాజు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. సోమవారం కురబలకోట మండలం అంగళ్లు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో ముంబై-చెన్నై జాతీయ రహదారి పక్కనే ఉన్న సర్వేనెంబర్ 220లో తాము కొనుగోలు చేసి భూమిని అనుభవిస్తున్నాం. కొందరు నేతలు భూమిని ఆక్రమించుకోవడానికి ప్రయత్ని

భూ ఆక్రమణ యత్నం అడ్డుకోండి

● కలెక్టరేట్ వద్ద బాధితుల ఆందోళన



కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేసేందుకు వచ్చిన బాధితులు

స్తున్నారని, వారి నుంచి తమకు న్యాయం చేయాలని కోరారు. స్థానిక నేతలు ఈ వివాదంలో తలదూర్చుతున్నారన్నారు. గతంలో ఈ భూమిలోకి ఎవరూ వెళ్లకుండా అధికారులు నిషేధాజ్ఞలు విధించారని, ఈ భూమికి మళ్లీ అదే విధంగా రక్షణ కల్పించాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఇప్పుడు ఆ భూమిలో సిమెంట్ పలకలతో నిర్మించిన ప్రహరీగోడను కూల్చివేసి ఆక్రమించుకోవడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. భూమికి రక్షణ కల్పించి తమకు న్యాయం చేయాలని కోరారు.

చారు. అనంతరం పీడీ వెంకటరత్నం కార్యాలయ సమావేశ ప్రాంగణంలో సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. కరువు ప్రాంతమైన కలకడ మండలంలో కూలీలకు 150 పని దినాలు కల్పించాలని ఆదేశించారు. పారంపాండ్లు, ఇంకుడు గుంతల పనులను పూర్తి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో

సంతకాలు లేకుండానే బిల్లుల చెల్లింపు?

● సామాజిక తనిఖీ ప్రజావేదికలో బహిర్గతం

● ఒక టీఏ, నలుగురు ఎఫ్ఏలకు జరిమానా

కలకడ, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): సిబ్బంది సంతకాలు లేకుండానే ఉపాధి కూలీలకు బిల్లులు చెల్లించిన వైనం సామాజిక తనిఖీ సమావేశంలో వెలుగులోకి వచ్చింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో చేసిన ఉపాధి పనులపై డ్వామా పీడీ వెంకటరత్నం ఆధ్వర్యంలో కలకడ మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం 18వ సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహించారు. రూ.7.47 కోట్లతో 486 పనులు చేయగా ఇందులో కూలీల వేతనాలకు రూ.5.85 కోట్లు, మెటీరియల్‌కు రూ.1.62 కోట్లు ఖర్చు చేశారు. అయితే నిబంధనలకు విరుద్ధంగా పనుల నిర్వహణ, నిధుల దుర్వినియోగం కింద కేవలం రూ.8639 రికవరీకి ఆదేశించడం విశేషం. బాలయ్యగారిపల్లె పంచాయతీలో 8 ఇంకుడు గుంతల పనికి రూ.42,128 ఖర్చు చేయడంపై డీఆ నేతృత్వంలో విచారణకు నిర్ణయించారు. పండ్లతోటల పథకం కింద లబ్ధిపొంది, మొక్కల సంరక్షణపై శ్రద్ధ చూపని 21 మందికి నోటీసులు జారీ చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన ఓ టెక్నికల్ అసిస్టెంట్, నలుగురు ఫీల్డ్ అసిస్టెంట్లకు జరిమానా విధి



బహిరంగ సభలో మాట్లాడుతున్న పీడీ వెంకటరత్నం

అబ్దుల్ రహీం, ఏపీడీ లక్ష్మీనరసయ్య, ఎస్ఆర్పీ సుబ్బారావు, ఏపీవో చెన్నకేశవులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో చోరీ కేసులో నిందితుడి అరెస్టు

రాయచోటి రూరల్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లక్ష్మీనగర్‌లో గత నెల 24 న జరిగిన ఆటో చోరీ కేసులో తిరుపతి పట్టణంలోని జీవకోన గాంధీ కాలనీకి చెందిన చిన్నం గారి షణ్ముగంను అరెస్టు చేసినట్లు రైల్వేకోడూరు సీఐ హేమసుందర్ తెలిపారు. మండలంలోని జంగిటివారిపల్లికు వెళ్లే మార్గంలో ఆటోలో పారిపోతున్న నిందితుడిని అదుపులోకి తీసుకుని, ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

సిద్ధవటం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : కారు, ఆటో ఢీకొనడంతో ఒకరికి గాయాలయ్యాయి. మండలంలోని మాధవరం గ్రామం శీతల గంగమ్మ ఆలయ సమీపంలో సోమవారం రాత్రి ఏడు గంటలకు ఈ ప్రమాదం చోటుచేసుకుంది. కడప నుంచి చాముండేశ్వరిపేటకు వస్తున్న ఆటో, తిరుపతి వైపు నుంచి కడపకు వెళుతున్న కారు ఢీకొనడంతో ఆటోలో ప్రయాణిస్తున్న ఎస్కే నగర్‌కు చెందిన కృష్ణయ్య (68) తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. కారు ఆగకుండా కడప వైపు వెళ్లిపోయిందని స్థానికులు తెలిపారు.

500 ఎకరాల్లో రిజర్వు ఫారెస్టు దగ్ధం

ములకలచెరువు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ములకలచెరువు సమీపంలో ఉన్న కనుగొండకు సోమవారం ఉదయం గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. దీంతో సుమారు 500 ఎకరాల్లో రిజర్వు ఫారెస్టు అగ్నికి ఆహుతైంది. మంటలు భారీగా ఎగసి చుట్టు పక్కల వ్యాపించాయి. విలువైన ఔషధ మొక్కలు, పశు గ్రాసంతో పాటు వన్య ప్రాణులు మంటల బారిన పడ్డాయి. అగ్ని మాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు ఆర్పేందుకు యత్నించారు. అప్పటికే మంటలు కొండపైకి వ్యాపించాయి. దీంతో కొండ పైకి వెళ్లేందుకు వీలు కాలేదు. మంటలు కొండంతా వ్యాపిస్తే వేల ఎకరాల్లో అడవికాలిపోయే ప్రమాదం ఉంది.



అగ్నికి ఆహుతవుతున్న కనుగొండ అటవీ ప్రాంతం

ఎర్రగొండకు నిప్పు

●కంది, మిరప పైర్లు వ్యవసాయ సామగ్రి బుగ్గిపాలు

సంబేపల్లె, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రగొండ అటవీ ప్రాంతంలో ఆదివారం మంటలు రేగడంతో, సమీపంలో ఉన్న పొలాలకు నష్టం వాటిల్లింది. అటవీ భూమికి ఆనుకొని ఉన్న సంబేపల్లెకు చెందిన రైతు వెంకటేశ్వర్లు పొలంలో ఉన్న 700 టమోటా కట్టె, స్ప్రేయర్ బాక్సు, 6 స్పింకర్ పైపులు కాలిపోయాయి. దాసరివాండ్లపల్లె రైతు నాగేశ్వరకు చెందిన రెండు ఎకరాలకు కంది పైరు కాలిపోగా, రామాంజులుకు చెందిన మిరప పైరు వాడిపోయింది. తమకు కలిగిన నష్టాన్ని గుర్తించి ఆదుకోవాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.



ఎర్రగొండకు నిప్పంటుకోవడంతో కాలిపోయిన కందిపైరు

'నాటుసారా రహిత సమాజం వైపు అడుగులు వేద్దాం'

నిమ్మనపల్లి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): నాటుసారా రహిత సమాజం వైపు అడుగులు వేయాలని తహసీల్దార్ అమరనాథ్, ఎసై తిప్పేస్వామి, ఎక్సైజ్ ఎసై మహమ్మద్ పేర్కొన్నారు. సోమవారం నిమ్మనపల్లి పంచాయతీ నాగలయ్యగారిపల్లెలో నాటుసారా వలన కలిగే నష్టాల గురించి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాటుసారా అమ్మడం, తాగడం చట్టరీత్యా నేరమని తెలిపారు. నాటుసారా ధర తక్కువగా ఉండటం వలన ఎంతోమంది దీనికి బానిసలవుతున్నారన్నారు. దీంతో ఎన్నో కుటుంబాలు వీధినపడుతున్నాయన్నారు. నాటుసారా లేని సమాజాన్ని తీర్చిదిద్దేందుకు అందరి సహకారం అవసరమని తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి వెంకటరమణ, మల్లప్ప, గ్రామస్థులు పాల్గొన్నారు.



నాటుసారాపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

బిట్స్ కాలేజీలో సక్సెస్ మీట్



కేక్ కట్ చేస్తున్న యాజమాన్యం, విద్యార్థులు

రాయచోటి, ఫిబ్రవరి 24: జేఎన్‌టీయూ అనంతపురం వారు విడుదల చేసిన ఫస్ట్ ఇయర్ సెమిస్టర్‌లో బిట్స్ విద్యార్థులు ప్రతిభ చాటారు. ఇందులో పఠాన్ సాజిదాఖానం, సీఎస్ఈ 87.5 శాతం కైవసం చేసుకుని యూనివర్సిటీ టాపర్ జాబితాలో నిలిచారు. అలాగే ఏఐలో సాయిచర్చిని 80.8 శాతం సాధించారు. అలాగే 20 మంది విద్యార్థులు 80 శాతం కంటే ఎక్కువగా, 30 మంది 70శాతం కన్నా ఎక్కువగా మార్కులు సాధించారు. కళాశాల స్థాపకుడు మన్సూర్ బాష్యర్ విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేశారు. ఆయన మాట్లాడుతూ కాలేజీ స్థాపించిన అనతి కాలంలోనే ఇంత విజయం సాధించడం ఎంతో సంతోషాన్నిస్తోందన్నారు.

సివిల్ జడ్జిల నియామక నోటిఫికేషన్ నిలిపివేయాలి

పీలేరు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ జరిగేంత వరకు జూనియర్ సివిల్ జడ్జిల నియామక నోటిఫికేషన్‌ను నిలిపివేయాలని మాదిగల ఐక్యవేదిక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ప్రభుత్వ పబ్లిక్ ప్రాసిక్యూటర్ల సంక్షేమ సంఘం మాజీ అధ్యక్షుడు పల్లెపోగు శ్రీనాథ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పీలేరులో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ పూర్తయ్యేంత వరకు టీచర్ల భర్తీని నిలిపివేసిన ప్రభుత్వం జూనియర్ సివిల్ జడ్జిల నియామక ప్రక్రియను కూడా నిలిపి వేయాలన్నారు. హైకోర్టు ఇటీవల వెలువరించిన జడ్జిల నియామక నోటిఫికేషన్‌లో ఎస్సీలకు వర్గీకరణ చూపకుండా కేవలం 4 ఖాళీలు చూపించారన్నారు. మొత్తం 50ఖాళీలు ఉండగా ఎస్సీలకు 15 శాతం రిజర్వేషన్ మేరకు 8 పోస్టులు రావాల్సివున్నారు. వర్గీకరణ లేకపోవడంతో ఆ పోస్టులు కూడా మాలలకు దక్కే అవకాశం ఉందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ అంశంపై దృష్టి సారించి మాదిగలకు న్యాయం చేయాలని ఆయన కోరారు.



సాయం కోసం...

- చేనేతల ఎదురుచూపులు
- 110 సొసైటీలకు అందని ఉపశమనం
- కోట్ల రూపాయల నాబార్డ్ నిధులు హోల్డ్‌లో
- సీఐడీ కేసులను బూచిగా చూపుతున్న అధికారులు

కడప ఎన్టీఆర్ సర్కిల్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): నాబార్డు నిధుల కోసం చేనేతలు సంవత్సరాల తరబడి ఎదురుచూస్తున్నా రు. కేంద్ర ప్రభుత్వం 80శాతం, రాష్ట్ర ప్రభుత్వం 20శాతం నిధులు కేటాయించి పునరుద్ధరణ సంస్కరణ పునర్నిర్మాణం (ఆర్ఆర్ఆర్) పథకం కింద నాబార్డు ద్వారా సాయం అందిస్తున్నాయి. ఈ క్రమంలో 2013లో చేనేత, జౌళిశాఖ అధికారులు ఉమ్మడి కడప జిల్లాలో నష్టాల్లో కూరుకుపోయిన చేనేత సంఘాలను తిరిగి పునరుద్ధరించేందుకు నాబార్డుకు ప్రతిపాదనలు పంపించారు. ఈమేరకు నాబార్డు నుంచి రూ.13.68 కోట్లు జిల్లాలోని 110 చేనేత సహకార సొసైటీలకు మంజూరైంది. ఇందుకు సం బంధించి 2020 సెప్టెంబరు 25వ తేదీ నిధులు విడుదల చేశారు. ఇందులో 15 సంఘాలకు సంబంధించిన రూ.1.97 కోట్ల పాత బకాయిలను బ్యాంకు అధికారు లు జమ వేసుకున్నారు. మిగిలిన సంఘాలకు సంబంధించి రూ.11.19 కోట్లు నిధులు ఇప్ప టికీ విడుదల చేయకపోవడంతో నాబా ర్డు ఉద్దేశం నీరుగారిపోతోందని చేనేత సంఘాల ప్రతినిధు లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పాత అప్పులోకి జమ

నష్టాల్లో ఉన్న చేనేత సహకార సంఘాలను ఆదుకునేందుకు నాబార్డు సాయమందిస్తే పాత అప్పులోకి రూ.1.97 కోట్లు డీసీసీబీ అధికారులు జమ వేసుకున్నట్లు సమాచారం. ఇందులో కొండమాచుపల్లె వీవర్స్ కోఆరేటివ్ సొసైటీ రూ.12.37లక్షలు, మారుతీ వీవర్స్ కోఆపరేటివ్ సొసైటీ దత్తాపురం రూ.17.40 లక్షలు, జమ్మలమడుగుకు చెందిన శ్రీభార్గవమ్మ వీవర్స్ కోఆపరేటివ్ సొసైటీ రూ.16.92లక్షలు, వేపరాలకు చెందిన శ్రీచౌడేశ్వరి సొసైటీ రూ.24.95లక్షలు, అప్పనపల్లె మహిళా కోఆపరేటివ్ సొసై టీ రూ.11.97లక్షలు, కోనరాజుపల్లె సొసైటీ రూ.6.5లక్షలు, తిరువెంగళాపురం సొసైటీ రూ.19.70లక్షలు, జమ్మలమడుగులోని శ్రీహరి వీవర్స్ కోఆపరేటివ్ సొసైటీ రూ.6.61లక్షలు పాతబకాయి కింద జమ అయ్యాయి. అదేవిధంగా ప్రొద్దుటూరుకు చెందిన లతా వీవర్స్ కోఆపరేటివ్ సొసైటీ రూ.4.31లక్షలు, శ్రీవేంకటేశ్వర సొసైటీ రూ.39.57లక్షలు, మోరగుడికి చెందిన తిరుమల సొసైటీ రూ.19.58 లక్షలు, శిరీష సొసైటీ రూ.8.14లక్షలు డీసీసీ బ్యాంకు పాత బకాయిల్లోకి సర్దుబాటు చేసినట్లు తెలుస్తోంది.

సాయం కోసం అగచాట్లు

ముందుగా నాబార్డు నిధులు విడుదలైన తర్వాత వాటిని పంపిణీ చేయకుండా తిరిగి నాబార్డుకు పంపించినట్లు సమాచారం. అయితే చేనేత కార్మికులు, నాయకులు కేంద్ర మంత్రిత్వ శాఖ దృష్టికి తీసుకెళ్లి తిరిగి నాబార్డు సాయాన్ని పొందినట్లు చెబుతున్నారు. ఇక సాయం అందుతుందని ఎదురుచూసే సమయంలో చేనేత జౌళి శాఖ అధికారులు ఈ సాయాన్ని ఆపాలంటూ బ్యాంకు అధికారులకు లెటర్ ఇవ్వడంతో నాబార్డు రుణం తమకు దక్కకుండా పోయిందంటున్నారు. చేనేత జౌళిశాఖ అధికారులు కొంతమంది అక్రమాలకు పాల్పడ్డారని.. పలు సొసైటీలపై సీఐడీ విచారణ పెండింగ్‌లో ఉందని బ్యాంకుకు లెటర్ రాయడంతోనే తమకు సాయం నిలిచిపోయిందని వివరిస్తున్నారు. ప్రస్తుతం ట్రిపుల్‌ఆర్ విడుదలైన జాబితాలో ఉన్న మోరగుడికి చెందిన శ్రీతిరుమల వీవర్స్ కోఆపరేటివ్ సొసైటీ, ప్రొద్దుటూరుకు చెందిన గాంధీరోడ్డు వీవర్స్ కోఆపరేటివ్ సొసైటీ, శిరీష వీవర్స్ కోఆపరేటివ్ సొసైటీలకు సంబంధించి మాత్రమే సీఐడీ విచారణ జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఈ సొసైటీలు ఆప్కోకు లివరీ సరఫరా చేశారంటూ ఆప్కో అధికారులు సీఐడీకి ఆ సొసైటీలకు సంబంధించిన రికార్డులను అందజేసినట్లు తెలుస్తోంది. కానీ దీన్ని సాకుగా చూపి మిగిలిన సొసైటీలకు కూడా నాబార్డు రుణం అందకుండా చర్యలు తీసుకోవడంతో ఇప్పటికే నష్టాల్లో ఉన్న చేనేత సహకార సంఘాలు మరింతగా దెబ్బతినే పరిస్థితి కనిపిస్తోంది. ఇప్పటికే కొన్ని సంఘాలకు ట్రిపుల్‌ఆర్ పథకాన్ని అమలు చేసిన అధికారులు తమ సంఘాలకు కూడా నాబార్డు సాయాన్ని అందించాలంటూ చేనేత శాఖ అధికారులతో పాటు కలెక్టర్లను కూడా పలు దఫాలుగా కలిసి వినతిపత్రాలు అందజేస్తున్నప్పటికీ నేతన్నలకు ఫలితం దక్కలేదు.

అధికార యంత్రాంగం ఇబ్బంది పెడుతోంది



చేనేత సహకార సొసైటీలకు నాబార్డు ద్వారా అందిన రుణా న్ని లబ్ధిదారులు పొందేలా సహకరించాలి. నాబార్డు ఎలాంటి ఆంక్షలు విధించకున్నా ఏదో ఒక కారణం చెబుతూ ఇక్కడ అధికార యంత్రాంగం ఇబ్బంది పెడుతోంది. అన్ని సొసైటీలకు అందిన రుణాన్ని ఇచ్చేందుకు అభ్యంతరం చెబుతున్న అధికారులు బ్యాంకుకు బకాయి ఉన్న సొసైటీల రుణాలను ఏ విధంగా సర్దుబాటు చేసుకున్నారు.

- అవ్వారు మల్లికార్జున, బీసీ నేత

చర్యలు తీసుకుంటాం..

కడప జిల్లా నుంచి రికార్డులు తెప్పించుకుంటున్నాము. అక్కడి సమస్యను పరిశీలించి చేనేత సహకార సంఘాలకు ప్రయోజనం కలిగేలా చర్యలు తీసుకుంటాం.

- శ్రీకాంత్, అదనపు సంచాలకులు చేనేత జౌళి శాఖ

ప్రతి మహిళకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన అవసరం : జేసీ



పోస్టర్లను విడుదల చేస్తున్న జేసీ అదితిసింగ్, డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, జడ్పీ సీఈవో ఓబులమ్మ తదితరులు

కడప కలెక్టరేట్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రతి మహిళ ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కలిగి ఉండాలని జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సభాభవన్‌లో ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల సందర్భంగా ఆర్థిక ప్రణాళిక, పొదుపు మరియు రిస్క్ మేనేజ్మెంట్, ఆర్థికవృద్ధి కోసం రుణ సదుపాయాలు అంశాలపై భారతీయ రిజర్వు బ్యాంకు ప్రచురించిన పోస్టర్లను జేసీ ఆవిష్కరించారు. ఈసందర్భంగా జేసీ మాట్లాడుతూ ఈనెల 24 నుంచి 28వ తేదీ వరకు ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలను నిర్వహించడం జరుగుతోందన్నారు. ప్రతి మహిళా బాధ్యాతాయుతంగా రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. నిర్ణీత సమయానికే రుణాలు చెల్లించి మంచి క్రెడిట్ స్కోర్ పొందాలన్నారు. తెలివిగా నడుచుకుంటూ ఆర్థిక క్రమశిక్షణ పాటించాలన్నారు. ముఖ్య అవసరాలను సరిగ్గా గుర్తించాలన్నారు. నెలసరి బడ్జెట్‌ని ప్లాన్ చేసుకొని పొదుపు పాటించాలన్నారు. డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, జడ్పీ సీఈవో ఓబులమ్మ, మెప్మా పీడీ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లలు శారీరక దృఢత్వాన్ని పెంచుకోవాలి

కడప మారుతీనగర్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): సమాజంలో జరుగుతున్న దురాగతాలను ఆత్మస్థైర్యంతో ఎదుర్కొనేలా ఆడపిల్లలు శారీరక మానసిక దృఢత్వం పెంచుకోవాల్సిన ఆవశ్యకత ఉందని ఏపీ సమగ్రశిక్ష అడిషినల్ ప్రాజె క్టు కో-ఆర్డినేటర్ నిత్యానందరాజులు పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో రాణి లక్ష్మీబాయి ఆత్మరక్ష శిక్షణ సెల్ఫ్ డిఫెన్స్ శిక్షణా కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో కార్యక్రమం నిర్వహించారు. రూపేష్ ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ సొసైటీ తాడేపల్లి- గుంటూరు జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి సమస్యను ఒంటరిగా ఎలా పరిష్కరించుకుని ముందుకుసాగాలి, నిరంతరం ఎలా చదువుకోవాలి అనే విషయాలను క్షుణ్ణంగా వివరించారు. ప్రధానంగా ఆడపిల్లలు 18 సంవత్సరాలు వచ్చే వరకు చదువు మానేయకుండా ప్రత్యేక శ్రద్ధతో అడుగులు వేయాలన్నారు. ముఖ్యంగా సెల్ ఫోన్లు, ట్యాబ్‌లు చూడడం తగ్గించాలన్నారు. కార్యక్రమంలో జీసీడీవో అనిత, రూపేష్ సొసైటీ జిల్లా కోఆర్డినేటర్ రసూల్, ఇన్‌చార్జ్ సలీం పాల్గొన్నారు.

కొబ్బరి చిప్పల వేలంతో రూ.10.50 లక్షల ఆదాయం

చక్రాయపేట, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): గండి వీరాంజనేయస్వామి దేవస్థానంలో సోమవారం సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో తలనీలాలకు, కొబ్బరి చిప్పలకు వేలం పాట నిర్వహించారు. తలనీలాలకు ఇద్దరే రావడం.. సరైన పాట పలకకపోవడంతో వాయిదా వేశారు. ఇప్పటి వరకు మూడు పర్యాయాలు వాయిదా వేశారు. ఏడాది పాటు కొబ్బరిచిప్పలను పోగు చేసుకునేందుకు వేలం నిర్వహించగా ఐదుగురు పోటీ పడ్డారు. కె.నాగరాజు అనే వ్యక్తి రూ.10.50 లక్షలకు పాట పాడి దక్కించుకున్నారు. కార్యక్రమంలో దేవస్థాన చైర్మన్ కావలి కృష్ణ తేజ, మాజీ చైర్మన్ కల్లూరు వెంకటస్వామి, ప్రధాన అర్చ కులు కేసరి, ఉప ప్రధాన అర్చకులు రాజారమేష్, ఏపీజీబీ అధికారి అవినాష్, ఎస్ఐ కృష్ణయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అనుమానాస్పద మృతి



సునీల్‌కుమార్‌రెడ్డి (ఫైల్)

దువ్వూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దజొన్నవరం గ్రామంలో తిమ్మారెడ్డి వెంకట సునీల్‌కుమార్‌రెడ్డి (28) అనే యువకుడు సోమవారం అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. మృతికిగల కారణాలు తెలియాల్సి ఉందని ఎస్ఐ వినోద్‌కుమార్ తెలిపారు. కాగా, సునీల్‌కుమార్‌రెడ్డి హైదరాబాదులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసేవాడు. వివాహం జరిగి సంవత్సరం అయిందని మృతుని తండ్రి రమణారెడ్డి, బంధువులు తెలిపారు. ఈ మేరకు మృతదేహాన్ని ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి.. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

సోషల్ మీడియాలో వేధింపులు.. ఐదుగురిపై కేసు నమోదు

కొండాపురం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): డబ్బుల కోసం సోషల్ మీడియాలో వేధిస్తున్నారని ఓ మహిళ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని వెంకయ్య కాల్వ గ్రామానికి చెందిన మానవహక్కుల నేత రామాంజనమ్మ కొండాపురం కిరాణా షాపు యజమాని నాగరాజుకు స్థలం ఇప్పిస్తానని రూ.60,000 డబ్బులు తీసుకుంది. ఇందులో ఆమె ఇంకా రూ.10,000 నాగరాజుకు చెల్లించాల్సి ఉంది. ఈవిషయమై మూడురోజుల కిందట ఇరువురు గొడవపడ్డారు. ఈనేపథ్యంలో రామాంజులమ్మ విషద్రావణం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. దీనిపై సోషల్ మీడియాలో నాగరాజు అతని కుటుంబసభ్యులు పోస్టు చేసి తన ప్రతిష్టకు భంగం కలిగించారని రామాంజులమ్మ పోలీసులకు ఫిర్యా దు చేసింది. ఈమేరకు నాగరాజు అతని కుటుంబసభ్యులు మరో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ మహమ్మద్‌రఫీ తెలిపారు.

తొమ్మిది గడ్డివాములు దగ్ధం



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

వల్లూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దిగువపల్లెలో ప్రమాదవశాత్తు నిప్పు అంటుకుని తొమ్మిది గడ్డివా ములు దగ్ధమయ్యాయి. గ్రామ సమీపంలో పశువుల మేత కోసం మైసూరారెడ్డి కాలనీకి చెందిన పామన్న, వెంకటలక్ష్మణ్, ప్రసాద్, బాలచంద్రాయుడు, గంగరాజు, రోషయ్య, లక్షుమయ్య, అంగడిబాబు గడ్డివాములను వేసుకున్నారు. సోమవారం మధ్యాహ్నం సమయంలో ప్రమాదవశాత్తు గడ్డివాములకు అగ్గి రాసుకుంది. పక్క పక్కనే ఉండడంతో మంటలు పెద్దఎత్తున ఎగిసి పడడంతో స్థానికులు వెంటనే ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు అదుపులోకి తెచ్చారు. అయితే అప్పటికే గడ్డివా ములు పూర్తిగా కాలిపోయి రూ.4లక్షలు నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ప్రేమ పెళ్లి పేరుతో మోసం... యువకుడిపై కేసు నమోదు

కడప క్రైం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): కడప నగరానికి చెందిన ఓ యువతిని ప్రేమ పెళ్లి పేరుతో మోసం చేసిన యువకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. కడపకు చెందిన ఓ యువతి ఓ ప్రైవేటు ఆసుపత్రిలో పనిచేస్తోంది. కర్నూలుకు జిల్లాకు చెందిన యువకుడు అదే ఆసుపత్రిలో పనిచేస్తూ.. ప్రేమ పేరుతో యువతి వెంట తిరుగాడు. ఆ యువతి పెళ్లి ప్రస్తావన తీసుకురావడంతో మాట మార్చి నిరాకరించాడు. ఈ మేరకు బాధితురాలు ఫిర్యాదు చేయ డంతో కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

ఝరి ఉత్సవ ఏర్పాట్ల పరిశీలన

కలకడ, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి మరుసటిరోజు జరిగే ఝరి ఉత్సవం ఏర్పాట్లను సోమవారం ఎంపీడీవో అబ్దుల్ రహీం పరిశీలించారు. ఈ సందర్భంగా భక్తులకు తాగునీరు, పారిశుధ్యం తదితర వసతులపై సిబ్బందితో సమీక్షించారు. అలాగే సిబ్బంది ఝరి వద్ద జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ విశ్వనాథ్, అధికారులు పాల్గొన్నారు.

సమ్మె కొనసాగిస్తాం...



విద్యార్థులతో మాట్లాడుతున్న కళాశాల డీన్ ప్రసాద్

ప్రొద్దుటూరు రూరల్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): స్టైఫండ్ పెంచుతూ ప్రభుత్వం నుంచి స్పష్టమైన జీవో వెలువడే వరకు సమ్మెను కొనసాగిస్తామని పశువైద్య కళాశాల విద్యార్థులు తేల్చిచెప్పారు. సోమవారం 22వ రోజు నిరసనలో భాగంగా విద్యార్థులు కళాశాల ఆవరణలో బైఠాయించి సమ్మెను కొనసాగించారు. ఈ సందర్భంగా కళాశాల డీన్ ప్రసాద్ వివిధ విభాగాలకు చెందిన అధికారులు సాగర్, పృథ్వి, ఓఎస్‌డీ కల్యాణి తదితరులు దీక్షా శిబిరం వద్దకు చేరుకొని విద్యార్థులతో సంప్రదింపులు జరిపారు. విద్యార్థుల న్యాయపరమైన డిమాండ్లను పైస్థాయికి పంపామని.. త్వరలో ఒక నిర్ణయం వెలువడుతుందని.. సమ్మెను విరమించి తరగతులకు హాజరు కావాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ గతంలో కూడా పశువైద్య అధికారులు, ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు హామీలతోనే సరిపెట్టారని.. తమకు ప్రభుత్వం నుంచి స్టైఫండ్ పెంచుతూ స్పష్టమైన జీవో వెలువడే వరకు సమ్మెను కొనసాగిస్తామని వివరించారు.

న్యాయం జరిగే వరకు...



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర

కొండాపురం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): గండికోట నిర్వాసితులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగిస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర తెలిపారు. మండలంలోని ఓబన్నపేట కమ్యూనిటీ హాల్‌లో సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో గండికోట నిర్వాసితులతో సదస్సు నిర్వహించారు. గండికోట ప్రాజెక్టు నిర్మాణం పూర్తయి దాదాపు పదేళ్లు కావస్తున్న ఇంతవరకు నిర్వాసితులకు పరిహారం అందించడంలో, మౌలిక సదుపా యాలు కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. ప్రాజెక్టులో పూర్తిస్థాయిలో నీళ్లు నింపినప్పటికీ ఇంతవరకు నిర్వాసితులకు పూర్తిస్థాయిలో పరిహారం చెల్లించలేదన్నారు. గత ప్రభు త్వం నిర్వాసితులకు రూ.10లక్షల పరిహారం ఇస్తామని చెప్పి, పూర్తిస్థాయిలో పరిహారం చెల్లించకుండా చేతులెత్తేసిందనారు. మొదటి విడత 14 గ్రామాలకు రూ.3,25,000 పరిహారం చెల్లించడంతో పాటు, రెండో విడత ఎనిమిది గ్రామాలకు పెండింగ్‌లో ఉన్న పరిహారాన్ని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్య క్షుడు ఎంవీ సుబ్బారెడ్డి, సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు మనోహర్ బాబు, రఘునాథరెడ్డి, బ్రహ్మానందరెడ్డి, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సత్వరం స్పందించాలి



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాశ్‌బాబు

కడప క్రైం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రజలు పోలీసు శాఖకు ఇచ్చే ఫిర్యాదుల పట్ల సత్వరం స్పందించి న్యాయం చేయాలని జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాశ్‌బాబు పోలీసు అధికారులను ఆదేశించారు.

స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలోని పెన్నార్ పోలీసు కాన్ఫరెన్స్ హాలులో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఫిర్యాదుదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి నిర్ణీత సమయంలో పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీటీసీ డీఎస్పీ అబ్దుల్‌కరీం పాల్గొన్నారు.

వృద్ధుడి దారుణ హత్య



హత్యకు గురైన గంగిరెడ్డి (ఫైల్)

లింగాల, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దిగువపల్లె గ్రామానికి చెందిన పప్పూరు గంగిరెడ్డి (71) సోమవారం దారుణ హత్యకు గురయ్యాడు. గుర్తుతెలియని వ్యక్తులు కొడవళ్లతో తలపై, గొంతుదగ్గర కిరాతకంగా నరికి హత్య చేశారు. వివరాల్లోకెళితే.... గంగిరెడ్డి రోజుమాదిరిగానే సోమవారం ఉదయాన్నే తోట వద్దకు వెళ్లాడు. ఎంతసేపటికి ఇంటికి రాకపోవడంతో భార్య లక్ష్మినారాయణమ్మ తన కుమారుడు యోగానందరెడ్డికి ఫోన్ చేసి మీనాన్న ఇంటికి రాలేదని తెలుపగా, పులివెందుల నుంచి తోటవద్దకు వచ్చి పరిశీలించగా హత్యకు గురై విగత జీవిగా కనిపించాడు. సమాచారం అందుకున్న పులివెందుల రూరల్ సీఐ రమణ, ఎస్ఐ మధుసూదన్‌రావు సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. కాగా, పొక్కపొలం రైతులు కేతిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, కేతిరెడ్డి గంగిరెడ్డిలు తరచూ మాపొలంలోకి రావద్దు అని చెప్పినా వచ్చే వారని, ఈ విషయమై గట్లు వద్ద ఘర్షణ జరిగిందని, వారిపైనే అనుమానం ఉందని హత్యకు గురైన గంగిరెడ్డి కుమారుడు యోగానందరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రమణ వెల్లడించారు. క్లూస్‌టీం రంగంలోకి దించి పరిశీలించారు.



హత్యకు గురైన గంగిరెడ్డి మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ రమణ

నగర పరిధిలో బస్ షెల్టర్లు ఏర్పాటుచేయాలి

కడప మారుతీనగర్, ఫిబ్రవరి 24, (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ ప్రాంతాలకు కడప నగరం నుంచి ఆర్టీసీ బస్సుల ద్వారా ప్రయాణం చేసే ప్రజల సౌకర్యార్థం నగరంలోని ప్రధాన సెంటర్ల లో (బిల్టప్, రామరాజుపల్లె నాగార్జున స్కూల్‌వద్ద, ఆలంఖాన్‌పల్లె తదితర ప్రదేశాలలో బస్ షెల్టర్లను ఏర్పాటచేయాల్సిన అవసరం వుందని భారతీయ జనతాయువమోర్చా (బీజేవైఎం) జిల్లా కార్యదర్శి చాగలమర్రి ఓబులేసు ప్రభుత్వాన్ని కోరారు. ఆ మేరకు బీజేవైఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఆర్టీసీ కడప రీజనల్ మేనేజర్ పొలిమేర గోపాల్‌రెడ్డిని ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ఆర్ఎంను కలిసిన వారిలో బీజేవైఎం నాయకులు పవన్‌కుమార్, సురేంద్ర, నాగిరెడ్డి తదితరులున్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌ను ప్రారంభించాలి

వేంపల్లె, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఐదు మండలాలకు కేంద్రంగా ఉన్న వేంపల్లెలో నిర్మాణం పూర్తై ఫర్నీచర్ అందుబాటులో ఉన్న ఇప్పటికీ ఆర్టీసీ బస్టాండ్‌ను ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని కడప ఆర్టీసీ ఆర్ఎం గోపాల్‌రెడ్డికి బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్, అసెంబ్లీ కన్వీనర్ మహేశ్వర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. కడపలో ఆర్ఎంను కలిసి సోమవారం వినతిపత్రం సమర్పించారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని ఆర్ఎం హామీ ఇచ్చినట్లు బీజేపీనేతలు తెలిపారు.

వైభవంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ



అన్నదానం నిర్వహిస్తున్న టీడీపీ నాయకుడు గోవర్ధన్‌రెడ్డి

కడప రూరల్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): కడప నగరం బాలాజీ గర్ రజక కాలనీలో నూతనంగా నిర్మించిన ఆలయంలో సీతా, రామ, లక్ష్మణ, అంజనేయ సమేత విగ్రహప్రతిష్ఠ సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ 44వ డివిజన్ ఇన్‌చార్జ్ నాయకుడు పుత్తా వెంకటసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని టీడీపీ రాష్ట్ర నాయకుడు గోవర్ధన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రామగంగిరెడ్డి, గడ్డం శ్రీనివాసులు, నాగభూషణం, ఉత్తమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించడంలో అలసత్వం వద్దు

కడప ఎర్రముక్కపల్లె,ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు పరిష్కరించడంలో అలసత్వం విడనాడాలని కమిషనర్ మనోజ్‌రెడ్డి తెలిపారు. సోమవారం కడప నగరం కార్పొరేషన్ వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలో 28 అర్జీలు వచ్చాయన్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి బాధితులకు న్యాయం చేయాలని అధికారులకు సూచించారు.

'దమ్ము, ధైర్యం గురించి అవినాశ్‌రెడ్డి మాట్లాడడం హాస్యాస్పదం'



మాట్లాడుతున్న హరిప్రసాద్

కడప ఎర్రముక్కపల్లె, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): దమ్ము, ధైర్యం గురించి అవినాశ్‌రెడ్డి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్ అన్నారు. సోమవారం కడప నగరం హరితహోటల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రతిపక్ష హోదా గురించి జగన్‌మోహన్‌రెడ్డి అసెంబ్లీలో రాద్ధాంతం చేయడం సిగ్గు చేటన్నారు. ప్రత్యేక హోదా ప్రజలిస్తే వస్తుందని కేకలు వేస్తే రాదన్నారు. మాట తప్పను మడమ తిప్పను అనే జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్ష హోదా ఇవ్వనంతవరకు అసెంబ్లీకి వెళ్లను అని చెప్పిన ఆయన అసెంబ్లీకి ఎలా వెళ్లారని ప్రశ్నించారు. రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ ఛైర్మన్ గన్నెపాటి మల్లేష్, నాయకులు బండి బాబు, సాయి పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన పార్థసారథిరెడ్డి



వేముల, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారథిరెడ్డి సోమవారం విజయవాడలో రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, పశుసంవర్ధక, పాడిపరిశ్రమ, మత్స్యశాఖ మంత్రి అచ్చెన్నాయుడును కలిశారు. పులివెందుల నియోజకవర్గంలోని పలు సమస్యలపై వినతిపత్రం సమర్పిం చారు. అలాగే టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్ల శ్రీనివాస రావును కలిశారు. నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేయాలని సూచించినట్లు పార్థసారథిరెడ్డి తెలిపారు.

అంగన్వాడీల సేవలు గొప్పవి

కమలాపురం రూరల్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : అంగన్వాడీ కార్యకర్తలు చేస్తున్న సేవలు ఎంతో గొప్పవని డీఈవో షంషుద్దీన్ అన్నారు. సోమవారం స్థానిక జడ్పీ గర్ల్స్‌హైస్కూలులో అంగన్వాడీలకు జరుగుతున్న జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఏపీసీ నిత్యానందరాజు, ఎంఈవోలు బేబి, సుభాషిణి, హెచ్ఎం సరస్వతి, డీఆర్పీ చంద్ర ఓబుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల్లో ఫుట్‌పాత్‌లు.. అవస్థల్లో పాదచారులు



ఫుట్‌పాత్‌ను ఆక్రమించిన వ్యాపారులు



అడ్డదిడ్డంగా ద్విచక్రవాహనాలు నిలుపుదల

కడప ఎన్టీఆర్ సర్కిల్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రధాన రహదారుల్లో అటు వాహనచోదకులు ఇటు ప్రజలు ఇబ్బందిపడకూడదనే ఉద్దేశంతో రద్దీగా ఉన్న ప్రాంతాలలో రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్‌లు ఏర్పాటుచేయడం జరుగుతుంది. ఇందు కోసం లక్షలాది రూపాయల ప్రజాధనాన్ని ఖర్చుచేస్తున్నారు. కడప నగరంలోని పలు వీధులలో రోడ్లకు ఇరువైపులా ఫుట్‌పాత్‌లు ఏర్పాటు చేస్తున్నారు. కానీ దుకాణదారులు వాటిని ఆక్రమిస్తున్నారు. దీంతో పాదచారులు రోడ్డున పడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. మరోపక్క వాహనదారులు కూడా ఇబ్బందిపడుతున్నారు. ఏడురోడ్ల కూడలి నుంచి గోకుల్ సర్కిల్ వరకు నిత్యం జనసంచారం ఉంటుంది. ద్విచక్రవాహనాలను నిర్దేశించిన పార్కింగ్ స్థలంలో కాకుండా రోడ్డుకు అడ్డదిడ్డంగా నిలబెడుతుండడంతో ఈ ప్రాంతంలో పాదచారులు, వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

'జగన్ ప్రతిపక్ష హోదా అడగడం అజ్ఞానం'



విజయజ్యోతి

కడప కలెక్టరేట్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): వైసీపీకి ప్రతిపక్ష హోదా, జగన్‌కు ప్రతిపక్ష నాయకుని హోదా ఇవ్వాలని గవర్నర్ ప్రసంగంలో వైసీపీ ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు నినాదాలు చేయడం, వాకౌట్ చేయడం అవివేకమని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు విజయజ్యోతి ఎద్దేవా చేశారు. సోమవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ అసెంబ్లీ నిబంధనలు, సాంప్రదాయాల ప్రకారం ఒక పార్టీకి ప్రతి పత్రిపక్ష పార్టీ హోదా ఇవ్వాలంటే మొత్తం సభ్యుల్లో 10 శాతం మంది ఉండాలన్నారు. ఆ ప్రకారంగా వైసీపీకి 18 మంది ఎమ్మెల్యేలు ఉండాలి. కానీ వారికి కేవలం 11 మంది ఎమ్మెల్యేలు మాత్రమే ఉన్నా ప్రతి పక్ష హోదాకు పట్టుబట్టడం అజ్ఞానమన్నారు.

వాటర్ గండిలో ఇసుక అక్రమ రవాణాపై చర్యలు తీసుకోండి

కమిషనర్‌కు కార్పొరేటర్ల వినతి



కడప ఎర్రముక్కపల్లె, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): వాటర్ గండిలో ఇసుక అక్రమ రవాణాపై చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్లు డిమాండ్ చేశారు. సోమవారం కడప నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ మనోజ్‌రెడ్డికి వారు వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ వాటర్ గండిలో ఇసుక అక్రమ రవాణా భారీ గా జరుగుతోందన్నారు. కడప నగరానికి తాగునీటి సరఫరాకు అవసరమైన బోర్‌లు మొత్తం వాటర్ గండిలో ఉన్నాయన్నారు. ఇక్కడ ఇసుక అక్రమ వాణా జరిగితే రానున్న వేసవి కాలంలో తీవ్ర మంచినీటి ఎద్దడి నెలకొనే అవకాశం ఉందన్నారు.

మద్దతు ధర కేంద్రం ప్రారంభం

పులివెందుల టౌన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏపీ మార్క్‌ఫెడ్, నాఫెడ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ కనీస మద్దతు ధర కొనుగోలు కేంద్రాన్ని ఏపీ మార్క్‌ఫెడ్ డైరెక్టరు, జిల్లా బీజేపీ అధ్యక్షుడు వంగల శశిభూషణ్‌రెడ్డి, పులివెందుల టీడీపీ సీనియర్ నేత మారెడ్డి జయభారత్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తూగుట్ల మధుసూధన్‌రెడ్డి ప్రారంభించారు. సోమవారం స్థానిక కొత్త బస్టాండు సమీపంలోని మార్కెట్ యార్డులో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతులకు ఎప్పటికీ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిర్మూలన మనందరి బాధ్యత

కమలాపురం రూరల్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : పట్టణ పరిధిలో ప్లాస్టిక్ నివారించడం మనందరి బాధ్యత అని మున్సిపల్ ఛైర్‌పర్సన్ మేరీ తెలిపారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్లాస్టిక్ నిషేధానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని తెలిపారు. మున్సిపల్ కమిషనరు పగడాల జ గన్నాథ్ మాట్లాడుతూ వ్యాపార సంస్థల ప్రతినిధులు ప్రత్యామ్నాయంగా లభించు జూట్‌బ్యాగులు, పేపరు బ్యాగులు మాత్రమే వాడాలన్నారు. సమావేశంలో మెప్మా టీఎంసీ నాగేంద్ర, శానిటరీ ఇన్‌స్పెక్టర్, వై.బాలనర్సింహులు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

తైక్వాండోలో సత్తా చాటిన విద్యార్థులు

కడప స్పోర్ట్స్ ఫిబ్రవరి 24, (ఆంధ్రజ్యోతి) : జిల్లా తైక్వాండో అసోసియేషన్ సారథ్యంలో నగర ఔట్‌డోర్ స్టేడియంలో నిర్వహించిన 3వ ఇంటర్‌క్లబ్ తైక్వాండో చాంపియన్‌షిప్ 2025లో నగర చెమ్ముమియాపేట కేశవరెడ్డి రెసిడెన్సియల్ పాఠశాల విద్యార్థులు సత్తాచాటి 18 గోల్డ్‌మెడల్స్, మరో 10 సిల్వర్ మెడల్స్ సాధించి ఛాంపియన్‌షిప్ ట్రోఫీని కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆ పాఠశాల ఛైర్మన్, డైరెక్టర్ కేశవరెడ్డి విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం శ్రీదేవి తైక్వాండో మాస్టర్ వసీం, డీన్ ద్వారకానాథ్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా వీరభద్రస్వామి కల్యాణం

సికెదిన్నె, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): చింతకొమ్మదిన్నె మండలంలో వీరభద్రస్వామి కల్యాణం సోమవారం ఎంతో ఘనంగా నిర్వహించారు. గంగమ్మ ఆలయం సమీపంలో వెలసిన వీరభద్రస్వామికి భక్తులు కల్యాణ మహోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. స్వామివారి కల్యాణాన్ని వేద పండితులు ఎంతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించి సాయంత్రం గ్రామోత్సవాన్ని నిర్వహించారు.

బైకు ఇస్తే తల్లిదండ్రులు కూడా శిక్షార్హులే

పులివెందుల టౌన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మైనర్లు వాహనం నడపడం చట్టరీత్యా నేరమని వారికి వాహనాలు ఇస్తున్న తల్లిదండ్రులు కూడా శిక్షార్హులేనని ట్రాఫిక్ సీఐ హాజీవలిఅన్నారు. సోమవారం పట్టణంలోని ఓల్డ్ ఆర్టీసీ బస్టాండు సర్కిల్‌లో నిర్వహించిన వాహనాల తనిఖీల్లో ఓ బాలుడు పట్టుబడగా అతని తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు.

ట్రాఫిక్‌పై అవగాహన కలిగి ఉండాలి

సికెదిన్నె, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కలిగి ఉండాలని ట్రాఫిక్ సీఐ జావెద్ తెలిపారు. మండలంలోని కేఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలు కచ్చితంగా పాటించాలన్నారు. కళాశాల సిబ్బంది, విద్యార్థులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

శివరాత్రికి సిద్ధమైన శివాలయాలు



విద్యుత్ కాంతుల్లో చెన్నూరు మల్లేశ్వరాలయం

చెన్నూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : మండలలంలోని శివాలయాలు మహాశివరాత్రి ఉత్సవాలకు సిద్ధమయ్యాయి. ఆలయాల వద్ద విద్యుద్దీపాలంకరణతో పాటు షామియానాలు కూడా ఏర్పాటు చేస్తున్నారు. సోమవారం తెల్లవారుజాము నుంచి ప్రజలు శివదర్శనం కోసం అధిక సంఖ్యలో తరలివస్తారని ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే దక్షిణకాశీగా పేరొందిన శివాలపల్లె కాశీ విశ్వేశ్వరాలయం, శివపార్వతుల కల్యాణం, చెన్నూరు నాగేశ్వరాలయంలో గ్రామోత్సవం, చెన్నూరు మల్లేశ్వరాలయంలో స్వామివారికి విశేష అలంకారాలు నిర్వహించనున్నారు. ఏర్పాట్లను పూర్తి చేయడంతో పాటు ఆలయాలను విద్యుద్దీపాలంకరణతో అలంకరించారు.

పొలతలలో నేడు...రేపు అన్నదానం

కడప కల్చరల్, ఫిబ్రవరి 24, (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా పొలతల మల్లేశ్వరస్వామిని దర్శించుకునేం దుకు వచ్చే భక్తుల సౌకర్యార్థం పొలతల మల్లేశ్వర స్వామి రజక అన్నదాన సేవా సమితి ఆధ్వర్యంలో ఈనెల 25, 26 తేదీలలో స్వామివారి సన్నిధిలో అన్నదానం నిర్వహిస్తున్నట్లు సమితి అధ్యక్షుడు మచ్చయ్యగారి మల్లయ్య వెల్లడించారు. సోమవారం స్థానిక మృత్యుంజయకుంటలోని సమితి కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్నదాన కార్యక్రమానికి సహకరిస్తున్న దాతలకు ప్రత్యేక ధన్యవాదాలు వ్యక్తం చేశారు.

శివరాత్రికి ఏర్పాట్లు

సికెదిన్నె, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా బుగ్గమల్లేశ్వరస్వామి ఆలయంలో బుధవారం స్వామివారి కల్యాణ మహోత్సవం అన్నదానం, సేద్యపు ఎద్దులచే బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గెలుపొందిన ఎద్దుల యజమానులకు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు.

● **పెద్దగాడిలో...:** మహాశివరాత్రి సందర్భంగా 25, 26 తేదీల్లో బుగ్గవంక డ్యాం సమీపంలో పెద్దగాడి వద్ద వెలసిన మల్లేశ్వరస్వామి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు పూజారి సుబ్బరాయుడు తెలిపారు.

పెండ్లిమర్రి..: నందిమండలం గ్రామంలో పాపాఘ్ని నది ఒడ్డున వెలసిన పర్వతవర్ధిని సమేత విశ్వనాథస్వామి శివరాత్రి ఉత్సవాలు సోమవారం నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. కాగా వేకువజామునే స్వామి, అమ్మ వార్లకు అభిషేకాలు,కుంకుమ అర్చన, పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా చెక్కభజన, మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు.

ఫార్మర్ రిజిస్ట్రీ పై సిబ్బందికి అవగాహన

పెండ్లిమర్రి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం రెవిన్యూ సిబ్బందికి, వ్యవసాయ సిబ్బందికి తహసీల్దార్ అనురాధ,ఏఓ ఓబులేసు ఆధ్వర్యంలో ఫార్మర్ రిజిస్ట్రీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీటీ నరసింహులు,ఏఈఓ గంగాధర్ రెడ్డి పాల్గొన్నారు.

నక్కలపల్లి సమ్మర్ స్టోరేజీలో పనులు పరిశీలన

పులివెందుల టౌన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : మున్సిపాలిటీ పరిధిలో నీటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు మున్సిపల్ కమిషనరు రాముడు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తూగుట్ల మధుసూధన రెడ్డికలిసి నక్కలపల్లిసమ్మర్ స్టోరేజీ వద్ద జరుగుతున్న పైపు పనులను పరిశీలించారు. 15వ ఆర్థిక సంఘానికి సంబంధించి పనులు చేసేందుకు నిధులు మంజూరు కావడంతో దాదాపు 70 లక్షల రూపాయలతో సమ్మర్ స్టోరేజీ ట్యాంకుకు మూడు మోటారు పైపులైన్లకు సంబంధించి వాటిని బిగింపు పంపుల ద్వారా నీటి సమస్య పరిష్కరించేందుకు పనులు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చిన్నరంగాపురం సుబ్బారెడ్డి, సారాయిపల్లె అంకాల్‌రెడ్డి, సిద్దయ్య, అక్రం, సుధాకరరెడ్డి, టీడీపీ నాయకులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

పొలతలలో బాధ్యతగా విధులు నిర్వర్తించాలి

కడప రూరల్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా పొలతల పుణ్యక్షేత్రంలో పారిశుధ్య కార్మికులు బాధ్యతగా విధులను నిర్వర్తించాలని పంచాయతీశాఖ జిల్లా అధికారి(డీపీవో) రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. పొలతల పుణ్యక్షేత్రంలో పారిశుధ్య విధులను నిర్వర్తించడానికి వివిధ గ్రామాకు చెందిన పారిశుధ్య సిబ్బందిని నియమిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులు ధరించడానికి కొత్త డ్రస్సుతో పాటు రేడియం జాకెట్లు, సబ్బులు, కొబ్బరి నూనె, గ్లౌజులు, మాస్కులు, టోపి తదితర వాటిని అందించామన్నారు.

కంటి క్యాన్సర్‌పై మరింత అవగాహన అవసరం

కడప నాగరాజుపేట, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): కంటికి క్యాన్సర్‌పై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని ఎల్‌వీపీఈఐ వైద్యులు కావ్యమాధురి బెజ్జంకి తెలిపారు. ఎల్వీప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ డాక్టర్ వైఎస్సార్ ప్రాంగణంలో సోమవారం కంటి క్యాన్సర్ సవాళ్లు, చికిత్స అనే అంశాలపై జరిగిన సదస్సులో ఆమె మాట్లాడుతూ కంటి క్యాన్సర్ అరుదైనప్పటికీ త్వరితంగా గుర్తించకపోతే అది ప్రాణాంతకం కావచ్చు అన్నారు. అధునాతనమైన వైద్య పద్ధతుల్లో చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు.

ఆప్కాస్ రద్దు చేసే ఆలోచనను విరమించుకోవాలి



కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

కడప సెవెన్ రోడ్స్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న ఆప్కాస్‌ను రద్దుచేయాల్సి వస్తే సుమారు 2.50లక్షల మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందరికీ ఆప్కాస్ కంటే మెరుగైన వ్యవస్థను ఏర్పాటుచేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు జి.వేణుగోపాల్, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు కేసీ బాదుల్లా, నగర అధ్యక్ష కార్యదర్శులు డిమాండ్ చేశారు. సోమవారం కడప నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ఏపీమున్సిపల్ వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు జాన్, రాజశేఖర్, వెంకటాద్రి పాల్గొన్నారు.

హెచ్‌పీ గ్యాస్ వినియోగదారుల ఇక్కట్లు



సింహాద్రిపురం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన సింహాద్రిపురంలో హెచ్‌పీ గ్యాస్ సిలిండర్ల పంపిణీ కేంద్రం లేకపోవడంతో వినియోగదారులు ఇక్కట్లకు గురౌతున్నారు. మండల కేద్రంతో పాటు పలు గ్రామాలకు సోమవారం ఒక్కరోజు మాత్రమే డీలర్ పులివెందుల నుంచి వాహనం ద్వారా సింహాద్రిపురం మండలానికి సరఫరా చేయడం జరుగుతోంది. దీంతో మిగతా రోజుల్లో గ్యాస్ సిలిండర్ ఖాళీ అయినా సోమవారం వరకు వేచి చూడాల్సిందే. ఆ ఒక్కరోజు కూడా ఉదయం నుంచి మధ్యాహ్నం లేదా సాయంత్రం వరకు గ్యాస్ వ్యాన్ ఎప్పుడైనా రావచ్చు. దానికి నిర్ధారించిన సమయం లేకపోవడంతో వినియోగదారులు ఆ రోజు తమ పనులను వదులుకుని పడిగాపులు కాయాల్సిందే. పలు మార్లు నాయకులు, అధికారులకు తమ గోడు వినిపించుకున్నా ఫలితం లేదని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా వినియోగదారుడు తన సెల్ ద్వారా గ్యాస్ సిలెండర్ బుక్ చేసుకుంటే గ్యాస్ ధర రూ.861లుగా మెసేజ్ వస్తుంది. కానీ డీలర్ వినియోగదారుని నుంచి రూ.940లు వసూలు చేయడం జరుగుతోందని వినియోగదారులు ఆరోపిస్తున్నారు.

సీపీ బ్రౌన్ గ్రంథాలయ అభివృద్ధికి కృషి

వైవీయూ ఉప కులపతి ఆచార్య ప్రకాశ్‌బాబు



ఉప కులపతిని సత్కరిస్తున్న జానమద్ది విజయభాస్కర్

కడప కల్చరల్ ఫిబ్రవరి 24, (ఆంధ్రజ్యోతి): బ్రౌన్ గ్రంథాలయాన్ని అన్ని విధాలా తప్పక అభివృద్ధి చేసేలా నూతన భవన నిర్మాణాలను కూడా త్వరితగతిన చేపడతామని యోగివేమన విశ్వవిద్యాలయం నూతన ఉప కులపతి ఆచార్య ప్రకాశ్‌బాబు అన్నారు. ఆచార్య ప్రకాష్‌బాబును బ్రౌన్ గ్రంథాలయ సలహామండలి సభ్యుడు జానమద్ది విజయభాస్కర్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు.

వీసీకి నాన్‌టీచింగ్ స్టాఫ్ శుభాకాంక్షలు

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయ నూతన ఉపకులపతిగా పదవీ బాధ్యతలు చేపట్టిన ప్రొఫెసర్ ప్రకాశ్‌బాబుకు వైవీయూ నాన్‌టీచింగ్ స్టాఫ్ సంఘం ప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు. అసోసియేషన్ అధ్యక్షుడు మల్లం రాజశేఖర్‌రెడ్డి తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణం లడ్లు, వడలు, పట్టువస్త్రాలతో వీసీని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు మాబాష, షబ్బీర్, గంగరాజు,మురళి, హరి, నవీన్, రాజశేఖర్, శివప్రసాద్, రామసుబ్బయ్య, పవన్, మల్లేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునఃప్రారంభించాలి



ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న దృశ్యం

కడప సెవెన్ రోడ్స్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఏపీబిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధం కడప జిల్లా సమితి ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి, ఏపీ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధం జిల్లా గౌరవాధ్యక్షుడు మద్దిలేటి, జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు మాట్లాడారు. భవన నిర్మాణ,ఇతర నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులు అనేక సమస్యలతో జీవితాలు గడుపుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే సంక్షేమ బోర్డును పునఃప్రారంభిస్తారని ఆశతో కార్మికులు ఎదురుచూస్తున్నారన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు ఇవ్వాలి

కడప సెవెన్ రోడ్స్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): సోమవారం కడపలో ఏపీ మధ్యాహ్న భోజన కార్మిక సంఘం ఏఐటీయూసీ అనుబంధం జిల్లా సమితి ఆధ్వర్యంలో డీఈఓ కార్యాలయంలో ఏడీ మునీర్‌ఖాన్‌కి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులపై రాజకీయ వేధింపులు, తొలగింపులు ఆపాలన్నారు. ప్రభుత్వ గ్యాస్ సబ్సిడీతో సరఫరాచేయా లన్నారు. ప్రతినెల 5వ తేదీలోపు జీతాలు ఇవ్వాలన్నా రు. పెండింగ్‌లో ఉన్న మూడు నెలల జీతాలు, మెస్ బిల్లులు ఇవ్వాలన్నారు. కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలన్నారు.

బ్రహ్మంగారి సన్నిధిలో మహాశివరాత్రి

● నేటి నుంచి ఉత్సవాల ఏర్పాట్లకు సర్వంసిద్ధం ● ఈశ్వరీదేవి మఠంలో ఈనెల 28 వరకు మూడు రోజుల పాటు కల్యాణోత్సవాలు

బ్రహ్మంగారిమఠం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): కాలజ్ఞాన కర్త శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి సజీవ నిష్ఠ వహించిన బ్రహ్మంగారిమఠం దేవస్థానంలో మహాశివరాత్రి కల్యాణమహోత్సవాలు ఈనెల 25 నుంచి (మంగళవారం) మార్చి 2వతేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు మఠం ఫిట్‌పర్సన్ శంకరబాలాజీతో పాటు మేనేజరు ఈశ్వరయాచారి తెలిపారు. శివరాత్రి మహోత్సవాలకు విచ్చేస్తున్న భక్తులకు భోజన వసతి, తాగునీరు, ఉండడానికి బస, సర్వం సిద్దం చేసినట్లు వారు తెలిపారు.


ఆలయ ప్రాంగణంలోని వీరబ్రహ్మేంద్రస్వామి


వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ప్రాంగణం

బ్ర.మఠంలో కార్యక్రమ వివరాలు

25న ఉదయం 5గంటలకు వీరబ్రహ్మేంద్ర సుప్రభాతం, అభిషేకం, సహస్ర నామార్చన, మధ్యాహ్నం12కు మఠాధిపతుల మూలపురుషులు పెద్దగోవిందస్వాముల వారి ప్రధమ పుత్రుడు గోవిందస్వామివారి ధర్మపత్ని వీరపాపాంబ వారి ఆరాధన రాత్రి 10గంటలకు శేషవాహనంపై వీరబ్రహ్మేంద్రస్వామి భక్తుల దర్శనం. 26న రాత్రి 8కి గోవిందమాంబసమేత వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవం అలాగే 27న ఉదయం 10గంటలకు మోహినీ అలంకారోత్సవం భక్తులకు స్వామివారు దర్శనం, మధ్యా హ్నం 12గంటలకు నామసంకీర్తన, రాత్రి8గం టలకు నంది ఉత్సవంపై స్వామివారి దర్శనం, 28నఉదయం10గంటలకు గజోత్సవం, మధ్యా హ్నం 12కు మహాప్రసాద వినియోగం, రాత్రి 9కి పుష్పరథోత్సవంపై దర్శనమిస్తారు.


జగన్మాత ఈశ్వరీదేవి అమ్మవారి దేవస్థానం ప్రాంగణం

ఈశ్వరీదేవిమఠంలో కల్యాణమహోత్సవాలు

అలాగే జగన్మాత శ్రీఈశ్వరీదేవి అమ్మవారి మఠంలో మహాశివరాత్రి కల్యాణ మహోత్సవాలు ఈనెల 25వతేదీ నుంచి 28 వరకు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు మఠాధిపతులు శ్రీ వీరశివకుమారస్వామి తెలిపారు. 25న మంగళవారం మాఘ బహుళ ద్వాదశి ఉదయం 6గంటలకు కలశ స్థాపన, అబిషేకం, కుంకుమార్చన, రాత్రి 8గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. 26న మాఘ బహుళ త్రయోదశి ఉదయం 6గంటలకు రుద్రాభిషేకం, 9గంటలకు యాగశాల ప్రవేశం, దీక్షాలంకరణ, అఖండ స్థాపన, మండపారాధన , శాంతిహోమం, ఉదయం 11గంటలకు ఆలయ ప్రాంగణంలో పార్వతీ పరమేశ్వరుల కల్యాణ మూర్తుల తులాభారం ఉంటుందన్నారు. రాత్రి 6గంటలకు కన్నులపండువగా పార్వతి పరమేశ్వరుల కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తున్నట్లు మఠాధిపతులు తెలిపారు. 27న రాత్రి 8గంటలకు పార్వతీ పరమేశ్వరుల గ్రామోత్సవం, రాత్రి 11కు ఈశ్వరీ మహాదేవి సిరహవాహన గ్రామోత్సవం, 28న మహాప్రసాద వినియోగం ఉంటుందని తెలిపారు. కార్యక్రమాలన్నీ కార్యనిర్వాహణాధి కారి బీవీ జగన్‌మోహన్‌రెడ్డి పర్యవేక్షణలో ఉంటాయని తెలిపారు.

ముక్కొండ మల్లేశ్వరుడి సన్నిధిలో..

మైదుకూరు రూరల్ ,ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి) :మహా శివరాత్రి పండుగ పురస్కరించుకొని మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని ముక్కొండలో వెలసిన ముక్కొండ మల్లేశ్వరుడి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభమవుతున్నాయి. ఇందుకు చిన్నయ్యగారిపల్లె వాసులు ముక్కొండ మల్లేశ్వరుడిని సులభంగా దర్శనం చేసుకొనే విధంగా దాతల సాయంతో కొండపైకి మెట్లు వేయించారు. దీంతో కొండపైకి భక్తులు సందడి పెరిగింది. నేటి నుంచే ముక్కొండపై ప్రత్యేక పూజలు జరుతాయని నిర్వాహకులు తెలిపారు.


ముక్కొండ మల్లేశ్వరుడు

అధికారులు హామీ ఇచ్చేవరకు దీక్షలు తప్పవు



గోపవరంలో ఆందోళన చేస్తున్న సీపీఐ నాయకులు

గోపవరం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ అధికారులు నిర్దిష్టమైన హామీ ఇచ్చే వరకు దీక్షలు విరమించమని బాధితులు స్పష్టం చేశారు. గోపవరం మండలం పీపీ కుంట వద్ద చిన్న పాటి గుడిసెలు రేకుల షెడ్లు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్న పేదలకు ఇంటిపట్టాలు ఇవ్వాలని సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. మూడురోజులుగా జరుగుతున్న రిలేదీక్షలకు మద్దతుగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వీరశేఖర్ హాజరై మాట్లాడుతూ పేదల పట్ల రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని పైపెచ్చు గుడిసెలను తొలగిస్తామని హెచ్చరికలు చేయడం దారుణమన్నారు. రెవెన్యూ అధికారులు స్పష్టమైన హామీ ఇవ్వకపోతే ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరవధిక దీక్షలకు పూనుకుంటామని ఆయన తెలిపారు. గోపవరం తహసీల్దారు స్పందించి ఎప్పుడూ ప్రజలకు అన్యాయం చేయనని, మీరు మీ దరఖాస్తులను అందిస్తే జాబితాను కలెక్టరుకు పంపి తగు న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. కార్యక్రమంలో భూపోరాట కమిటీ కన్వీనరు పీవీ రమణ, గోపవరం మండల కార్యదర్శి గూడూరు పెంచలయ్య, శాఖ కార్యదర్శి వెంకటయ్య, సహాయకార్యదర్శి ఓబులేసు, కమిటీ సభ్యులు గురయ్య శివ, సుబ్బరా యుడు, లక్ష్మమ్మ, ఓబులమ్మ ప్రభాకర్, రమాదేవిపాల్గొన్నారు.

కులవివక్ష చూపుతున్న వారిపై చర్యలు తీసుకోవాలి


బైఠాయించి నిరసన తెలియజేస్తున్న రాష్ట్ర మాలమహానాడు నేతలు

జమ్మలమడుగు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): దళితులపట్ల కుల వివక్ష చూపుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు రామాజి ఇమ్మానుయేల్ డిమాండ్ చేశారు. ఆ మేరకు పట్టణంలోని తహసీల్దారు కార్యాలయం సమీపాన అంబేడ్కర్ విగ్రహం ఎదుట రోడ్డుపై బైఠాయించి కులవివక్ష చూపుతున్న ఆర్డీవో కార్యాలయంలోని అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేశారు. అక్కడి నుంచి ర్యాలీగా బయల్దేరి ఆర్డీవో కార్యాలయం ఎదురుగా నిరసన తెలిపారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో సంబంధిత సిబ్బందికి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. తమకు న్యాయం జరుగకపోతే ఈ పోరాటం మళ్లీ కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాలమహానాడు నాయకులు మురళీప్రసాద్, ఓబులేసు, వెంకటరమణ, ప్రణయ్‌కుమార్, కిరణ్‌కుమార్, పుల్లయ్య, నీతు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ వెంటనే అమలు చేయాలి

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎస్సీలను ఏబీసీడీ వర్గీకరణను వెంటనే అమలు చేయాలని ఏపీఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఎస్సీ వర్గీకరణ అమలుకు మాదిగ రాజకీయ నాయకుల రౌండ్ టేబుల్ సమావేశం ఎన్జీవో హోంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీవర్గీకరణను ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో తీర్మాణం ప్రవేశపెట్టి అమోదం పొందాలని కోరారు. ఏపీఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యల్లయ్య మాదిగ, రాష్ట్ర కార్యదర్శి పాలలక్షుమయ్య మాదిగ, జిల్లా ఉపాధ్యక్షుడు క్రిష్ణమూర్తి మాదిగ, తిరుమలయ్య, మహదేవుడు, దళిత సమాఖ్య నాయకుడు కొత్తపల్లి ఎల్లయ్య, ఎర్రన్న, సుధాకర్, పాల నరసింహులు, రాధమ్మ, అంజనమ్మ, బాలగురమ్మ పాల్గొన్నారు.

సీమ పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు కేటాయించాలి


నిధుల కోసం ధర్నా చేస్తున్న నేతలు

ప్రొద్దుటూరు , ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న బడ్జెట్‌లో రాయలసీమ పెండింగ్ ప్రాజెక్టులకు పదివేల కోట్లు నిధులు కేటాయించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రామయ్య డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద బడ్జెట్‌లో రాయలసీమకు నిధులు కేటాయించాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రామయ్య మాట్లాడుతూ మూడు దశాబ్దాల క్రితం ప్రారంభించిన తెలుగుగంగ, గాలేరీ- నగరి,హంద్రీ-నీవా వెలుగొండ ప్రాజెక్టులు నేటికి పూర్తికి కాలేదన్నారు. రాయలసీమలో మూడేళ్ళకు ఒకసారి కరువు తలుపు తడుతుందన్నారు. పల్లెల్లో జీవనోపాధిలేక రైతులు నగరాలకు వలసబాట పడుతుంటారన్నారు. తక్షణమే బడ్జెట్‌లో పదివేల కోట్లు కేటాయించి డిస్ట్రిబ్యూటరి చానల్స్ మీద దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి సుబ్బరాయుడు, ఏరియా సమితి సభ్యులు శివారెడ్డి, రామకృష్ణ, హరి, చంద్రశేకర్, మచ్చాశ్రీను, మద్దిలేటి, ప్రమీల, సుజాత తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలపై సీఎం పోస్టు కార్డు ఉద్యమం




పోస్టు కార్డులతో నిరసన తెలియజేస్తున్న మున్సిపల్ కార్మికులు

ప్రొద్దుటూరు , ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ కార్మికుల సమస్యపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు పోస్టుకార్డుల ద్వారా తెలయపరచడం జరిగిందని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు సత్యనారాయణ, కార్యదర్శి సాల్మాన్‌లు తెలిపారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యా లయం వద్ద సీఐటీయూ అనుబంధ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పోస్టుకార్డులతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆప్కాస్ కార్మికులందరిని రెగ్యులర్ చేయాలన్నారు. నేటి ధరలకు అనుగుణంగా 26 వేల రూపాయల జీతం పెంచాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్‌కుమార్, కోశాధికారి రాఘవ, రవికుమార్, గుర్రమ్మ, ప్రమీల, సీతమ్మ ,అన్నపూర్ణ ,మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ అవినాష్‌రెడ్డిని కలిసిన ఎర్రగుంట్లనాయకులు

ఎర్రగుంట్ల, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని ఎర్రగుంట్ల వైసీపీ ఎర్రగుంట్ల పట్టణ అధ్యక్షుడు వై.జయరామిరెడ్డి, డి.యల్లారెడ్డి, ఎం.కేశవరెడ్డి, మాధవరెడ్డి తదితర నాయకులు సోమవారం కలిశారు. ఈ సందర్భంగా ఎర్రగుంట్ల మండల సమస్యలపై అయనకు వివరించగా తనపరిధిలో ఉన్న వాటిని పరిష్కరించేందుకు కృషిచేస్తానని ఎంపీ హామీ ఇచ్చారని నాయకులు పేర్కొన్నారు.

పేదలకు అన్యాయం చేస్తే సహించం


దీక్షలకు మద్దతు తెలిపిన మునెయ్య, శంకర్‌నాయక్

బద్వేలు రూరల్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : పేదలకు అన్యాయం చేస్తే సహించమని దళిత హక్కుల పోరాట సమితి, ఏపీ గిరిజన సమాఖ్య కార్యదర్శులు కె.మునెయ్య, శంకర్‌నాయక్‌లు పేర్కొన్నారు. భాకరాపేట సమీపంలో గత నాలుగురోజులుగా దీక్షలు చేస్తున్న సీపీఐ కాలనీవాసులకు మద్దతు ప్రకటించి వారు మాట్లాడారు. ఇంటిపట్టాలు మంజూరు చేయాలంటూ నిరాహారదీక్షలు చేస్తున్న వారి పట్ల ప్రభుత్వం, ప్రభుత్వ అధి కారులు సానుకూలత నిర్ణయం తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యుడు పడిగె వెంకటరమణ, రూరల్ కార్యదర్శి నాగదాసరి ఇమ్మానుయేల్, వెంకటేశ్, ప్రసాద్, రాజశేఖర్, 38మంది దీక్షల్లో పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

మైలవరం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఎక్కడైనా, ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటివారినైనా ఉపేక్షించేది జమ్మలమడుగు డీఎస్పీ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మండల పరిధిలో చిన్నకొమెర్ల గ్రామంలో సోమవారం రాత్రి కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ చిన్న చిన్న సమస్యలకు గొడవలు పడకుండా పల్లెల్లో ప్రజలు ప్రశాంతంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో జమ్మలమడుగు రూరల్ సీఐ గోపాల్‌రెడ్డి, తలమంచిపట్నం ఎస్‌ఐ లక్ష్మినారాయణ, కళాజాత బృందం అధికారులు, సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

గడ్డివామి దగ్ధం

చాపాడు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నగురవలూరు గ్రామంలో సోమవారం మధ్యాహ్నం అగ్నికి గడ్డివామి దగ్ధమైనట్లు మైదుకూరు అగ్నిమాపక దళ అధికారి వెంకటరమణ తెలిపారు. శివశంకర్ అనే రైతుకు చెందిన ఒకటిన్నర ఎకరా పొలంలోని వరి గడ్డి దగ్ధమైందని దీని విలువ సుమారు రూ.40 వేలన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు అంటించి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు.

ఇంటి పన్నులు వందశాతం వసూలు చేయాలి

ఎర్రగుంట్ల, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ఇంటి పన్నులు మార్చి 15నాటికి వంద శాతం వసూలు చేయాలని జమ్మలమడుగు డీఎల్‌పీవో తిమ్మక్క పంచాయతి సిబ్బందిని ఆదేశించారు. సోమవారం ఎర్రగుంట్ల మండలంలోని పోట్లదుర్తి పంచాయతి కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఇప్పటి వరకు ఇంటి పన్ను ఎంత వసూలు చేశారని ప్రశ్నించారు. ఈకార్యక్రమంలో సర్పంచి పెద్ద నరసింహులు, ఈవోపీఆర్‌డీ రంతుల్లయ్య, కార్యదర్శి జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

టి. కోడూరులో వీధిలైట్లు ఏర్పాటు

కొండాపురం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టి.కోడూరు గ్రామంలో సోమవారం వీధిలైట్లను ఏర్పాటు చేశారు. ఎంపీటీసీ రామమునిరెడ్డి ఆధ్వర్యంలో గ్రామంలోని వీధుల్లో వీధిలైట్లు ఏర్పాట్లు చేశారు. వీధిలైట్లు ఏర్పాటు చేస్తుండటంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

3105 మంది రైతుల రిజిస్ట్రేషన్

ముద్దనూరు ఫిబ్రవరి24(ఆంధ్రజ్యోతి):మండలంలో 3105 మంది రైతులు రిజిస్ట్రేషన్ చేయంచుకున్నారని ఏవో వెంకటకృష్ణారెడ్డి పేర్కొన్నారు. సోమవారం రెవెన్యూ అధికారులతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రైతు సేవాకేంద్రాలలో రైతు రిజిస్ట్రేషన్ చేయడం జరిగిందన్నారు. అనంతరం తహసీల్దారు లాగిన్‌కు వచ్చిన తరువాత పరిశీలించి ఆమోదించాల్సి ఉందన్నారు. తహసీల్దారు వరదకిశోర్‌రెడ్డి, వీఆర్వోలు పాల్గొన్నారు.

గంగమ్మ గుడికి భూమి పూజ

కొండాపురం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌటిపల్లె గ్రామంలో సోమవారం గంగమ్మ తల్లి ఆలయానికి భూమిపూజ నిర్వహించారు. గ్రామంలోని మత్స్యకారుల ఆధ్వర్యంలో గంగమ్మ గుడి నిర్మించనున్నారు. ఈ కార్యక్రమంలో మండల కూటమి ఇన్‌చార్జ్ శివనారాయణరెడ్డి, మండల టీడీపీ అధ్య క్షుడు నాగేశ్వరరెడ్డి, ఉపసర్పంచ్ వెల్లాల రఘునా థరెడ్డి, మాజీ సర్పంచ్ రామలింగేశ్వరరెడ్డి, మత్స్య కారులు, తదితరులు పాల్గొన్నారు.

1 నుంచి ప్లాస్టిక్ నిషేధం

జమ్మలమడుగు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు నగర పంచాయతీ పరిధిలో మార్చి 1వ తేదీ నుంచి ప్లాస్టిక్ నిషేధం విధించినట్లు కమిషనర్ వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం కమిషనర్ మాట్లాడుతూ పట్టణంలోని వ్యాపారస్థులు, కూరగాయల వ్యాపారులు, రెస్టారెంట్లు, హోటళ్లు, జనరల్ స్టోర్స్, వస్త్ర దుకాణాలు, మాంసం దుకాణాలకు, యజమానులు ప్లాస్టిక్ వినియోగిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.

పేదలకు ఇంటిపట్టాలు ఇవ్వాలి


బద్వేలులో ధర్నా చేస్తున్న నేతలు

బద్వేలు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): భాకరాపేటచెరువు వద్ద గత కొన్ని నెలల నుంచి గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్న పేదలకు ఇంటిపట్టాలు ఇవ్వాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో బద్వేలు తహశీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చంద్రశేఖర్, పట్టణ కార్యదర్శి బాలు మాట్లాడుతూ పేదలను ఆదుకుని పట్టాలు మంజూరు చేయాల్సిందిపోయి గుడిసెలు తొలగించాలని చూడడం దారుణమన్నారు. కార్యక్రమంలో పలువురు సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

బద్వేలు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి నాగేష్ డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈసందర్భంగా నాగేష్ మాట్లాడుతూ తక్షణమే ఆప్కాస్ రద్దుచేసి ప్రైవేటు ఏజన్సీలకు అధికారం అప్పగించాలనే ఆలోచన విరమించుకోవాలని డిమాండ్ చేశారు. మార్చి 3న జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా, మార్చి 6న చలో విజయవాడ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ సీనియర్ నాయకులు నరసయ్య, శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

పేదవాడి సొంతింటి కల నెరవేర్చాలి



ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

పోరుమామిళ్ల, ఫిబ్రవరి 24 (ఆంధ్ర జ్యోతి) : పేదవాడి సొంతింటి కల ఇంటిపట్టా ఇచ్చి నెరవేర్చాలని సీపీ ఐ ఏరియా సహాయ కార్యదర్శి పిడు గు మస్తాన్ అన్నారు. సోమవారం పోరుమామిళ్ల తహసీల్దారు కార్యాలయం ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో భూపోరాటాల్లో ఉన్న పేదలకు ఇంటిపట్టాలు ఇవ్వాలని ధర్నా చేశారు. నియోజకవర్గంలోని తిరుపతిరెడ్డికాలనీ, భగత్‌సింగ్‌కాలనీ, పీపీకుంట, భాకరాపేట, కొత్తపల్లె కాలనీల్లో ప్రతి పేదవాడికి రెండు సెంట్లు ఇంటిస్థలం ఇవ్వాలన్నారు. అనంతరం తహసీల్దారు చంద్రశేఖర్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. సీపీఐ, ఎఐటియుసి నాయకులు పాల్గొన్నారు.

యాదవ సేవా సంఘం నూతన కార్యవర్గం

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణాలయం యాదవ సేవా సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు నాని కృష్ణారెడ్డియాదవ్, పామిడి రామసుబ్బయ్యయాదవ్, రిటైర్డు డీఎస్పీ ఎన్.సుబ్బారెడ్డియాదవ్, బచ్చల చిన్ననాగన్నయాదవ్ ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా చల్లా రాజగోపాల్‌యాదవ్, అధ్యక్షుడిగా దాసరి బాలసుబరాయుడుయాదవ్, కార్యదర్శిగా ఆర్.వెంకటరమణయాదవ్, కోశాధికారిగా .వెంకటయ్యయాదవ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సందర్భంగా నూతన సంఘం కమిటీ నాయకులు కృష్ణాలయం అభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

పరిహారం చెల్లించకపోతే క్రిమినల్ కేసులు

దువ్వూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలంలో క్రాసింగ్ జొన్నసాగుతో నష్టపోయిన రైతులకు సదరు కంపెనీలు పరిహారం చెల్లించకపోతే క్రిమినల్ కేసులు పెడుతామని మైదుకూరు ఏడీఏ క్రిష్ణమూర్తి తెలిపారు. రైతన్నను ముంచిన జొన్న' అనే శీర్షికన కథనం సోమవారం 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో ప్రచురితమైన విషయం విధితమే. దీనిపై ఏడీఏ స్పందిస్తూ విత్తనాలు ఇచ్చిన ఏజెంట్లతో దువ్వూరు మండల వ్యవసాయాధికారి మాట్లాడారని ఎకరాకు రూ.50 వేలు పరిహారం చెల్లించేందుకు ఏజెంట్లు ఒప్పుకున్నారని తెలిపారు. వీలైనంత ఎక్కువ మొత్తం రైతులకు కంపెనీలు చెల్లించే విధంగా మాట్లాడుతామని ఏడీఏ చెప్పారు.

జోగుతున్న మండల వ్యవసాయ శాఖ

దువ్వూరు మండల వ్యవసాయ శాఖ రైతుల విషయంలో నిద్రావస్థలో ఉందని రైతు నాయకులు ఆరోపిస్తున్నారు. విత్తనాలు విత్తే సమయంలో ఏజెంట్లతో ఎందుకు మాట్లాడలేదని విమర్శిస్తున్నారు. అగ్రిమెంట్లు రాసివ్వని కంపెనీ ఏజెంట్లను మండల వ్యవసాయ శాఖ ఎందుకు ప్రశ్నించలేదని మొక్కుబడులుగా పొలంబడి, రైతు సదస్సులు ఏర్పాటు చేస్తున్నారేకానీ ఎంత మంది రైతులకు వారి వల్ల ప్రయోజనం జరిగిందని రైతు నాయకులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికి సదరు కంపెనీల ఏజెంట్ల ద్వారా కాకుండా కంపెనీ ప్రతినిధులు నష్టపరిహారం రాతమూలకంగా ఇవ్వకపోవడం దారుణమని రైతు సంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

విద్యావ్యవస్థకు అంగన్‌వాడీలు మూలస్తంభాలు


అంగన్వాడీలతో మాట్లాడుతున్న డీఈవో షంషీద్దున్

ఎర్రగుంట్ల, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): విద్యావ్యవస్థకు అంగన్‌వాడీలు మూలస్థంభాలని డీఈవో షంషుద్దీన్ పేర్కొన్నారు. అంగన్‌వాడీ టీచర్స్‌కు జరుగుతున్న 120రోజుల జ్ఞానజ్యోతి శిక్షణా కార్యక్రమాన్ని సోమవారం ఎర్రగుంట్ల బాలుర ఉన్నత పాఠశాలలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల బలోపేతానికి కృషిచేయాలన్నారు. ఏపీసీ నిత్యానందరాజు మాట్లాడుతూ 3-5 వయసున్న చిన్నారుల్లో హోలిస్టిక్ డెవలప్‌మెంట్ సాధించే క్రమంలో స్వేచ్ఛాయుత వాతావరణం కల్పించాలన్నారు. ఈకార్యక్రమంలో ఎంఈవోలు శివప్రసాద్, రామాంజనేయరెడ్డి, కేఆర్‌పి చంద్ర ఓబుళరెడ్డి, డీఆర్‌పీలు పాల్గొన్నారు.

చిన్నారుల సామర్థ్యాలను పెంచేందుకే శిక్షణ

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ చిన్నారుల్లో సామర్థ్యాలను పెంచడానికి జ్ఞానజ్యోతి శిక్షణ ఇస్తున్నట్లు ఎంఈవో సావిత్రమ్మ తెలిపారు. సోమవారం ఐసీడీఎస్ అర్బన్, రూరల్ ప్రాజెక్టులలోని 320 మంది అంగన్వాడీ వర్కర్లకు అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూలులో రెండవ విడత జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సీడీపీవోలు హైమావతి, అరుణకుమారి, ఆర్పీలు నాగేంద్ర, భాస్కర్, నరేష్, నీరజ, అంగన్వాడీ సూపర్‌వైజర్లు, సీఆర్‌పీలు తదితరులు పాల్గొన్నారు.

చేతిపంపుల మరమ్మతులకు శ్రీకారం

బి.కోడూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని గ్రామాల్లో వేసవిని దృష్టిలో ఉంచుకుని చేతిపంపులను రిపేరు చేసి వారికి నీళ్ల అందించేందుకు సోమవారం ఎంపీడీవో భాస్కర్‌రావు ఆధ్వర్యంలో శ్రీకారం చుట్టారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అల్లాబకాస్ ఆటోలో మరమ్మత్తుల సావగ్రి నింపుకుని ప్రతి గ్రామానికి వెళ్లి చేతిపంపులు రిపేరు చేయించి వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలకు శ్రీకారం చుట్టామన్నారు.

ఏకాగ్రతతో అనుకున్న లక్ష్యాలు సాధించాలి

బద్వేలు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఏకాగ్రతతో చదివి అనుకున్న లక్ష్యాలను సాధించాలని డీడీ సరస్వతి సూచించారు. సోమవారం బద్వేలు పట్టణంలోని బాలుర హాస్టల్‌లో ప్రేరణ శిక్షణా తరగతులను నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ త్వరలో 10వ తరగతి పరీక్షలు మొదలు కాబోతున్నాయని విద్యార్థులు ఏకాగ్రతతో చదివి మంచి మార్కులు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ హరిక్రిష్ణ, బి.మదుసూధన్‌రెడ్డి, లక్ష్మీదేవి, శివశంకరయ్య, బాలరాజు, జగన్ తదితరులు పాల్గొన్నారు.

ఇండోర్ స్టేడియం కమిటీ ఏర్పాటు చేయాలి

ప్రొద్దుటూరు , ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్‌ఇండోర్ స్టేడియం నూతన కార్య నిర్వాహక కమిటీని ఏర్పాటు చేయాలని కమిషనర్ మల్లికార్జున స్టేడియం సభ్యులకు తెలిపారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ ఇండోర్ స్టేడియం సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సభ్యులందరు కలిసి కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవాలన్నారు. .కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ మణి గోపాల్ రెడ్డి ఫిజికల్ డైరెక్టర్ రాఘవేంద్ర తదితర సభ్యులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియమాలు పాటించండి

ఖాజీపేట, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నియమాలు పాటించి వారి గమ్యస్థానాలకు చేరుకోవాలని సీఐ మోహన్ అన్నారు. సోమవారం ఖాజీపేట, కమలాపురం రోడ్డులో వాహనాలు తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు వాహనాలకు జరిమానాలు విధించారు. ప్రతి వాహనదారుడు రిజిస్ట్రేషన్, బీమా, డ్రైవింగ్ లైసెన్స్, పొల్యూషన్స్ రికార్డులు వెంట ఉంచుకోవాలన్నారు.